ప్రజాశక్తి

సోమవారం 30 డిసెంబర్ 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి



ప్రతినిధుల సభలో మాట్లాడుతున్న లోకనాథం, వేదికపై వి.శ్రీనివాసరావు, జగ్గునాయుడు, సిహెచ్.నర్సింగరావు తదితరులు

ఉద్యమోత్తేజం

- ముగిసిన సిపిఎం విశాఖ జిల్లా మహాసభ
- విస్తృత ప్రజా ఉద్యమంతో విశాఖ ఉక్కును కాపాడుకోవాలని పిలుపు
- జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్
- పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేసిన రాష్ట్ర నేతలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

సిపిఎం విశాఖ జిల్లా 24వ మహాసభ ఉద్యమోత్తేజంతో ముగిసింది. రెండు రోజులపాటు పెందుర్తిలోని జి.సుబ్బారావు నగర్, జి.సన్యాసిరావు ప్రాంగణంలో జరిగిన ఈ మహాసభ జిల్లాలోని పలు సమస్యలపైనా, ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపైనా చర్చించి ఉద్యమ కార్యాచరణ రూపొందించింది. విస్తృత ప్రజా ఉద్యమంతో విశాఖ ఉక్కును కాపాడుకోవాలని పిలుపునిచ్చింది. జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేసింది. మహాసభలో రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. 24 మందితో నూతన జిల్లా కమిటీ ఎన్నికైంది. జిల్లా కార్యదర్శిగా తిరిగి ఎం.జగ్గునాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

రెండో రోజైన ఆదివారం ప్రతినిధుల సభలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ 'విశాఖ జిల్లాలో గడచిన మూడేళ్ల కాలంలో విభిన్నమైన కృషిని సిపిఎం శ్రేణులు, నాయకులు చేశారు. బహుముఖంగా ఇక్కడ ఉద్యమాలు జరిగాయి. రాగల రోజుల్లో ఇంకా ప్రభావవంతమైన రీతిలో పోరాడాలి' అని పిలుపునిచ్చారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు జరుపుతున్న పోరాటం చారిత్రాత్మకమైనదన్నారు. మోడీ ప్రభుత్వ ప్రయివేటీకరణ కుట్రలను సిపిఎం, కార్మికులు ఎలా తిప్పికొట్టిందీ తెలియజేశారు. విశాఖలో బాలల సంఘం పని తీరును శ్రీనివాసరావు కొనియాడారు. ఇక్కడ విద్యార్థి ఉద్యమానికి ఊపిరిలూదేలాగ బాలల సంఘం కృషిచేస్తోందని

మిగతా 2లో..



కార్యదర్శి జగ్గునాయుడు



గంగారావు



ఆర్‌కెఎస్‌వి.కుమార్



కెఎం.శ్రీనివాసరావు



బి.జగన్



బి.పద్మ



పి.మణి



వి.కృష్ణారావు

24 మందితో జిల్లా కమిటీ ఎన్నిక

24 మందితో సిపిఎం విశాఖ జిల్లా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. జిల్లా కార్యదర్శిగా ఎం.జగ్గునాయుడు తిరిగి ఎన్నికయ్యారు. కార్యదర్శివర్గ సభ్యులుగా డాక్టర్ బి.గంగారావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్, బి.పద్మ, కెఎం.శ్రీనివాసరావు, బి.జగన్, పి.మణి, వి.కృష్ణారావు, జిల్లా కమిటీ సభ్యులుగా బొట్టా ఈశ్వరమ్మ, డాక్టర్ కె.రమాప్రభ, వై.సత్యవతి, యుఎస్‌ఎన్.రాజు, ఎల్‌జె.నాయుడు, ఆర్‌ఎస్‌ఎన్.మూర్తి, డి.అప్పలరాజు, వి.నరేంద్ర కుమార్, ఎం.సుబ్బారావు, పి.పైడిరాజు, ఎం.రాంబాబు, పిఎస్‌బి.శ్రీనివాసరాజు, బి.రమణి, బలివాడ వెంకటరావు, యు.రామస్వామి, ఉరుకూటి రాజు ఎన్నికయ్యారు.



బంగారు పతకం, సర్టిఫికెట్ అందిస్తున్న నిర్వాహకులు

పెదగాడి స్కూల్ మాస్టార్‌కు గోల్డ్ మెడల్

ప్రజాశక్తి-విశాఖపట్నం

గుంటూరు నందమూరి తారకరామారావు స్టేడియంలో ఈ నెల 28, 29 తేదీల్లో నిర్వహించిన 6వ రాష్ట్ర స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో భాగంగా పరుగుపందెంలో పెందుర్తి మండలం పెదగాడి గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఎ.రవిప్రతాప్ గోల్డ్ మెడల్ సాధించారు. 200 మీటర్ల పరుగు పందెంలో గోల్డ్‌మెడల్ సాధించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. విజేతలకు గుంటూరు డిప్యూటీ మేయర్, నిర్వాహకులు మెడల్స్, సర్టిఫికెట్లను అందించారు. ఈ సందర్భంగా రవి ప్రతాప్‌కు మండల విద్యాశాఖాధికారి, తోటి ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

కరెన్సీ నోట్‌పై అంబేద్కర్ బొమ్మను ముద్రించాలి

వార్త 2లో..

నర్సీపట్నంలో విషాదం తండ్రి చేతిలో కొడుకు హత్య

వార్త 3లో..

బల్క్ డ్రగ్ కంపెనీ వద్దు

వార్త మెయిన్ 3లో..

జైలు వివాదంపై డిఐజి సీరియస్

వార్త మెయిన్ 3లో..

అబ్బురపరిచిన నావికాదళ విన్యాసాలు



ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : విశాఖ వేదికగా 2025 జనవరి 4న నిర్వహించనున్న నేవీ డే వేడుకలను పురస్కరించుకొని సన్నాహక విన్యాసాలు రెండో రోజు ఆదివారం కూడా బీచ్ రోడ్‌లోని విశ్వప్రియ ఫంక్షన్ హాల్ వేదికగా నిర్వహించారు. రెండో రోజు సన్నాహక విన్యాసాల్లో భాగంగా హెచ్‌కె.బాంబింగ్, మార్కస్ డెమో, హీలో ల్యాండింగ్ డెమో, హెచ్‌కె డెమో, ఏంజెల్ డెమో, ఎస్‌ఎఆర్ డెమో, హార్న్ పైప్ డాన్స్, కంపోసిట్ ఫ్లై పాస్ట్, బీటింగ్ రిట్రీట్ అండ్ సన్ సెట్ సెర్మనీ, సెర్మోనియల్ సన్ సెట్‌తో పాటు కంటిన్యూటీ డ్రిల్ వంటి విన్యాసాలు, ప్రదర్శనలు తూర్పు నావికాదళంలోని అనుభవజ్ఞులైన అధికారులు ప్రదర్శించారు. చివరిలో నౌకలను ప్రకాశవంతం చేస్తూ నిర్వహించిన లేజర్ షో సందర్శకులను ఆకర్షించింది. ఈ వేడుకలకు సంబంధించి 2025 జనవరి 2న నిర్వహించే ఫుల్ డ్రెస్ డెమో రిహార్సల్స్‌కు తూర్పు నావికాదళ విభాగాధిపతి హాజరవుతారని, 2025 జనవరి 4 నిర్వహించే వేడుకలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు హాజరవుతారని అధికారులు తెలిపారు. ఈ విన్యాసాలను వీక్షించాలనుకునే నగర ప్రజలకు అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఏర్పాట్లలో సహకరించిన వియంఆర్‌డిఎ, జివిఎంసి, పోలీస్ విభాగాలకు, జిల్లా అధికార యంత్రాంగానికి నేవీ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.

పోర్టు సిఎస్‌ఆర్ నిధులతో క్యాజువాలిటీ అభివృద్ధి

కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద





ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం పోర్టు ట్రస్టు సిఎస్‌ఆర్ నిధుల నుంచి అందించిన రూ.కోటితో కెజిహెచ్‌లోని క్యాజువాలిటీని ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి పనులను చేపట్టినట్లు కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద తెలిపారు. కెజిహెచ్‌లో జరిగిన, జరగబోతున్న పలు అభివృద్ధి పనుల గురించి ప్రజాశక్తితో ఆయన మాట్లాడారు.

అగ్ని ప్రమాదాల్లో కాలిపోయి, గాయపడ్డ వారికి కెజిహెచ్‌లో అందుతున్న సేవలు ఎలా ఉన్నాయి?

ప్రయివేటు పరిశ్రమల్లో అగ్ని ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడ్డ వారు సరైన వైద్యం పొందాలంటే ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. కెజిహెచ్‌లో అటువంటి వారికి వైద్యం చేస్తున్నప్పటికీ ఆధునిక సౌకర్యం లేదు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇటువంటి ప్రమాదాలు అధికంగా జరుగుతున్నట్లు గుర్తించి కెజిహెచ్‌లో ప్రత్యేకంగా బర్న్ వార్డును ఏర్పాటు చేశాం. హెచ్‌పిసిఎల్ సిఎస్‌ఆర్ నిధులు రూ.1.20 కోట్లుతో ప్లాస్టిక్ సర్జరీ విభాగంలో బర్న్ వార్డును ఆధునికరించాం.

హిమోఫీలియా ఇంజక్షన్లు ఇస్తున్నారా?

ఇవి చాలా ఖరీదైన ఇంజక్షన్లు. హిమియోఫీలియా సంరక్షణ కోసం పీడియాట్రిక్ విభాగంలో ఒక పైలెట్ ప్రాజెక్టు ఏర్పాటుచేశాం. రోగులకు ఉచితంగా ఖరీదైన ఇంజక్షన్లు అందిస్తున్నాం. ఒక ఇంజక్షన్ ఖరీదు రూ.43 వేలు. ఏడాది మొత్తంలో ఒక్కొక్క రోగికి రూ.52 లక్షలతో ఉచితంగా ఇటువంటి ఇంజక్షన్లు ఇచ్చే కార్యక్రమం చేపట్టాం. రక్తం గడ్డ కట్టడం, రక్తస్రావం జరగకుండా నిరోధించడంలో ఇవి ఎంతగానో పనిచేస్తాయి.

గిరిజన ప్రాంతం నుంచి వచ్చే రోగులకు అందుతున్న వైద్య సేవలు పరిస్థితి ఏమిటి?

కెజిహెచ్‌లో గిరిజనులకు వైద్య సేవలు సక్రమంగా అందించడం కోసం, ముఖ్యంగా సికిల్ సెల్ వ్యాధికి జన్యు పరీక్ష నిర్వహణ కోసం రెండేళ్ల పైలెట్ ప్రాజెక్టుకు కేంద్రంలోని గిరిజన సంక్షేమ శాఖ రూ.6 కోట్లా 30 లక్షలు మంజూరు చేసింది.

సికిల్ సెల్ వ్యాధికి జన్యు పరీక్షలు సక్రమంగా అందిస్తున్నాం. గిరిజన ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు భాష సమస్యగా ఉంది. దానిని అధిగమించడం కోసం ఐటిడిఎ సహకారంతో

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

పోర్టు సిఎస్ఆర్ నిధులతో క్యాజువాలిటీ అభివృద్ధి

గిరిజనులు మాట్లాడే భాషను మాట్లాడగలిగే ఇద్దరిని ప్రత్యేకంగా ఏర్పాటుచేశాం. ఇందువల్ల రోగులకు భాష సమస్య ఉండదు. ఇటువంటి సౌకర్యం మన రాష్ట్రంలో ఇక్కడ మాత్రమే ఉంది.

అన్ని వార్డులలో బాత్రూములు కంపు కొడుతున్నాయని, శుభ్రంగా లేవని విమర్శలు ఉన్నాయి?

ఇది ఆరు మాసాల క్రితం మాట. ఇప్పుడు అలా లేదు. భవనగర్ బ్లాక్, రాజేంద్రప్రసాద్ బ్లాక్, పీడియాట్రిక్, ఆర్థోపెడిక్ విభాగాలలో రోగులు వినియోగించే, బాత్రూమ్‌లను నిత్యం పరిశుభ్రంగా, సౌకర్యవంతంగా ఉండేలా తీర్చిదిద్దాం. మరికొన్ని బాత్రూమ్‌లను పునరుద్ధరించే పనులను చేపట్టాం.

ఇటీవల కేన్సర్ రోగులు పెరిగారు. వారికోసం వైద్యం ఎలా ఉంది?

కేన్సర్ రోగుల కోసం ప్రత్యేకంగా ప్రివెంటివ్ అంకాలజీ యూనిట్‌ను కొత్తగా ఏర్పాటు చేశాం. ఒపి 222లో కేన్సర్ రోగులకు ఉచితంగా వైద్యం అందుతుంది. ఇక్కడ వారంలో 2 రోజులు మాత్రమే ఒపి ఉంటుంది. ఇక్కడికి వచ్చే రోగులు ఎటువంటి ఒపి టిక్కెట్ లేకుండా నేరుగా రావచ్చు.

తల్లిపాల బ్యాంకు ఏర్పాటు చేస్తున్నారా?

తల్లిపాలు బ్యాంకు ఏర్పాటు గొప్ప కార్యక్రమం. షుసేనా హెల్త్ ఫౌండేషన్ వారు ఏర్పాటుకు ముందుకొచ్చి దీనికి అవసరమైన స్థలాన్ని ఇటీవల గుర్తించారు. కెజిహెచ్‌లో తల్లిపాల బ్యాంకు ఏర్పాటు కోసం రూ.1.50 కోట్లు ఇచ్చేందుకు ఆ సంస్థ అంగీకరించింది. జనవరి 5న ఎంఒయుపై సంతకాలు జరుగుతాయి.

ఇంకా చేపట్టిన పనులు ఏమైనా ఉన్నాయా?

బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగానికి రూ.15 లక్షల విలువైన స్కోప్‌లను విరాళంగా ఇచ్చింది. ఈఎస్ఎఐ ఫార్మాసూటికల్స్ వారు పీడియాట్రిక్ సర్జరీ విభాగానికి పోటీ కాంప్లెక్స్ ఆధునీకరణకు రూ.40 లక్షలు, రూ15 లక్షలు విలువైన పరికరాలను విరాళంగా ఇచ్చారు రాష్ట్ర ప్రభుత్వం అనకాపల్లి ప్రాంతీయ ఆసుపత్రి నుంచి రూ. 40 లక్షలు విలువైన ఎండోస్కోపీ, కోలోనోస్కోప్ వైద్య పరికరాలను, విశాఖపట్నం విమ్స్ నుంచి రూ.40 లక్షల విలువైన యురాలజీ పరికరాలను కెజిహెచ్‌కు బదలాయించారు. ప్రత్యేకమైన వైద్య చికిత్సకు అవసరమయ్యే రోగులకు గరిష్ట సామర్థ్యంతో సేవలు అందివ్వడానికి ఈ పరికరాలు ఉపయోగపడతాయి.

మొదటి పేజీ తరువాయి..

ఉద్యమోత్తేజం



నూతన జిల్లా కమిటీతో రాష్ట్ర నాయకులు

కితాబిచ్చారు. ప్రజలను మానవత్వ రాజకీయాల వైపు తీసుకురావాలని, వారిలో సామాజిక, సాంస్కృతిక, రాజకీయ చైతన్యం పెంచాలని పిలుపునిచ్చారు.

8న మోడీ విశాఖ పర్యటనను అడ్డుకోవాలి

సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శిగా రెండోసారి ఎన్నికైన ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ, జనవరి 8న మోడీ విశాఖ పర్యటనను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ మనుగడను ప్రశ్నార్థకం చేస్తూ వేల మంది ఉద్యోగులు, వారి కుటుంబాలను అవస్థలకు గురిచేసే బిజెపి విధానం మారకపోతే విశాఖలో అడుగుపెట్టనివ్వబోమని హెచ్చరించారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇటీవల అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా 30న విశాఖలో ఆందోళన జరుపనున్నామన్నారు. మహాసభలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, రాష్ట్ర సీనియర్ నాయకులు సిహెచ్.నర్సింగరావు, మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ మాట్లాడారు.



ఒకే వేదికపై సిపిఎం కుటుంబాలు

35 తీర్మానాలు ఏకగ్రీవ ఆమోదం

సిపిఎం 24వ జిల్లా మహాసభ పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించింది. అవి...

1. విస్తృత ప్రజా ఉద్యమం ద్వారా విశాఖ ఉక్కును కాపాడుకోవాలి. పూర్తి సామర్థ్యంతో ప్లాంట్‌ను నడపాలి. సెయిల్‌లో విలీనం చేయాలి. సొంత గనులు కేటాయించాలి.
2. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలి
3. పెంచిన కరెంట్ ఛార్జీలు, స్మార్ట్ మీటర్లను రద్దుచేయాలి
4. పంచ గ్రామాలు, ఇనాం భూ సమస్యలను పరిష్కరించాలి
5. 296, 301, 388 జిఒ పట్టాలను రిజిస్ట్రేషన్ చేయాలి
6. ఇల్లులేని పేదలకు రెండు సెంట్ల ఇంటి స్థలం ఇవ్వాలి. ఇల్లు నిర్మించాలి
7. టిడ్కో, హుదూద్, జగనన్న ఇళ్లను లబ్ధిదారులకు వెంటనే అందించాలి
8. ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగ ఖాళీలను నింపాలి
9. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలి
10. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలి
11. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు వెంటనే అమలు చేయాలి
12. కొండవాలు ప్రాంతాలు, మురికివాడల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి
13. రుషికొండ భవనాలను మ్యూజియంగా ఏర్పాటు చేయాలి
14. విలువ ఆధారిత ఆస్తిపన్నును రద్దు చేయాలి
15. రైతుల పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వాలి
16. కూటమి ప్రభుత్వ సూపర్ 6 పథకాలను అమలు చేయాలి
17. అసంఘటిత రంగ కార్మికులకు ఇఎస్ఐ, పిఎఫ్‌తో కూడిన సమగ్ర చట్టం చేయాలి
18. పరిశ్రమల్లో ప్రమాదాలను అరికట్టాలి
19. పరిశ్రమల నుంచి వస్తున్న కాలుష్యాన్ని అరికట్టాలి
20. వాల్తేరు డివిజన్‌తో కూడిన విశాఖ రైల్వే జోన్ నిర్మాణం వెంటనే చేపట్టాలి
21. విశాఖ మెట్రో రైలు నిర్మాణం వెంటనే చేపట్టాలి
22. షీలానగర్‌లో 500 పడకల ఆసుపత్రి, మెడికల్ కాలేజీ నిర్మాణం చేపట్టాలి
23. పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉపాధి కల్పించాలి.
24. స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి.
25. మద్యం, డ్రగ్స్‌ను నియంత్రించాలి.
26. మహిళలు, పిల్లలపై హత్యలు, అత్యాచారాలు ఆపాలి.
27. ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యులను, సిబ్బందిని పెంచాలి.
28. పోర్టు జూబ్లీ హాస్పిటల్ ప్రైవేటీకరణ ఆపాలి.
29. ప్రభుత్వం నిర్మించిన వాంబే, జెఎన్ఎన్‌యుఆర్ఎం, జగనన్న, హుదూద్ కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి.
30. నగరంలోని గాజువాక, ఊర్వశి, సత్యం, మద్దిలపాలెం, హనుమంతువాక, ఎండాడ, కారుషెడ్ తదితర జంక్షన్లలో ఫ్లైఓవర్లు నిర్మించాలి.
31. ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు కల్పించాలి
32. విశాఖపట్నం జిల్లా కేంద్ర గ్రంథాలయ భవనాన్ని అధునాతనంగా నిర్మించాలి.
33. మత్స్యకారుల సమస్యలను పరిష్కరించాలి.
34. ఉచిత ఇసుక వాగ్దానాన్ని అమలు చేయాలి
35. తోపుడు బండ్ల కార్మికులకు ఉపాధి భద్రత కల్పించాలి.

కరెన్సీ నోట్‌పై అంబేద్కర్ బొమ్మను ముద్రించాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఇండియన్ కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫొటో ముద్రించాలని అంబేద్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షులు జెర్రిపోతుల పరశురాం కోరారు. జాతీయ సలహాదారు ఆళ్ల రామకృష్ణతో కలిపి ఆదివారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫొటో ముద్రించాలని డిమాండ్ చేస్తూ తమ సాధన సమితి ఆధ్వర్యాన ఢిల్లీలో ధర్నా చేసినట్లు తెలిపారు. 18 రాష్ట్రాల్లో సాధన కమిటీ అనేక పర్యటనలు చేసిందని, ఆర్‌బిఐ గవర్నర్‌ను కూడా కలిసి అంబేద్కర్ ఫొటో పెట్టాలని కోరినట్లు తెలిపారు. పార్లమెంట్‌లో కొత్తగా ప్రమాణ స్వీకారం చేసిన ఎంపీలు ఈ అంశాన్ని లేవనెత్తాల్సిన అవసరం ఉందని చెప్పారు.

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : నగరంలోని 19వ వార్డు పరిధి పెదజాలరిపేటలో ఇటీవల పిడుగు పడి మరణించిన అరసవిల్లి పోలినాయుడు కుటుంబానికి రూ.10 లక్షల సిఎం సహాయ నిధి చెక్కును విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆదివారం అందించారు. 19వ వార్డు కార్పొరేటర్ నొల్లి నూకరత్నం, టిడిపి నాయకుడు తెడ్డు రాజు, మత్స్యకార నాయకుడు పరదేశి పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌జి మేళాను సందర్శించిన ఎంపీ శ్రీభరత్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఎఎస్ఆర్ మైదానంలో జరుగుతున్న ఎస్‌హెచ్‌జి మేళాను ఆదివారం స్థానిక ఎంపీ ఎం.శ్రీభరత్ సందర్శించారు.

హోంగార్డుల సంక్షేమానికి సంస్కరణలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖ నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలోని హోంగార్డుల సంక్షేమానికి పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పలు సంస్కరణలు చేపట్టారని పోలీసు అధికారులు తెలిపారు. 2011 నుంచి వాయిదా పడుతూ వస్తున్న హోంగార్డుల ప్రమోషన్ల పరీక్షలు నిర్వహించి 25 మందికి ఉద్యోగోన్నతులు కల్పించారన్నారు. సుమారు వందమంది హోమ్ గార్డులకు, వారి కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స అందించినట్లు తెలిపారు. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న 22 మందిని గుర్తించి వారికి ఇంటి దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్లలోనే తాత్కాలిక, తేలికపాటి విధులు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేశారని, మహిళా హోంగార్డులకు నైట్ డ్యూటీలు వేయకుండా గౌరవించారని అధికారులు పేర్కొన్నారు. కారుణ్య నియామకాల్లో భాగంగా చనిపోయిన హోంగార్డు కుటుంబానికి 24 గంటల్లోనే నియామకపత్రం అందించడం రాష్ట్ర చరిత్రలోనే ప్రథమం అని తెలిపారు. హోంగార్డుల సమస్యల పరిష్కారానికి దర్బార్లు నిర్వహించడంతోపాటు 18 మంది విరమణ పొందిన వారి కుటుంబ సభ్యులకు ప్రైవేటు సంస్థల్లో ఉపాధి కల్పించడానికి కృషి చేశారని వివరించారు. స్టీల్ ప్లాంట్‌లో పనిచేస్తున్న హోంగార్డులకు రెండు నెలల జీతం అందకపోవడంతో వారికి డ్యూటీ అలవెన్సులు సత్వరమే అందేలా కమిషనర్ చర్యలు చేపట్టారని అధికారులు పేర్కొన్నారు. హోంగార్డుల అభ్యర్థుల మేరకు డ్యూటీ మార్పును ఆరు నెలల నుంచి రెండేళ్లకు పెంచారని, పోలీస్ కానిస్టేబుళ్లతో సమానంగా హోంగార్డులకు షిఫ్ట్‌పద్ధతి డ్యూటీ వేయాలని అధికారులకు ఆదేశించామన్నారు.

40 మంది రక్తదానం



దాతలకు సర్టిఫికెట్లు ఇస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో సాయిబాబా ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు 40 మంది యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు.విశాఖ బ్లడ్ సెంటర్ సహకారంతో రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు ఎ రాంప్రసాద్, సాయిప్రసాద్, జోనల్ కోఆర్డినేటర్ సత్యసాయి, జిల్లా స్టడీ సర్కిల్ ఇన్‌చార్జి రవిప్రసాద్, సమితి కన్వీనర్ గొట్టిపల్లి సత్య నారాయణ, సమన్వయకర్తలు టివిఆర్ బాబా, సంతోష్, యూత్ కోఆర్డినేటర్ దివాకర్ పాల్గొన్నారు. రక్తదాతలకు సర్టిఫికెట్లను అందజేసిన నిర్వాహకులు వారిని అభినందించారు.

క్రమశిక్షణతో చదివితే ఉజ్వల భవిష్యత్

ప్రజాశక్తి -మధురవాడ : పాఠశాల దశ నుంచే క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాచ్చునివిద్యార్థులు నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి సూచించారు. . ఆదివారం కొమ్మాది కూడలి దరి కృష్ణవికాస్ విజయం స్కూల్ వార్షికోత్సవంలో మాట్లాడుతూ కృషి, పట్టుదల, క్రమశిక్షణతో విద్యను అభ్యసించేలా విద్యార్థుల తల్లిదండ్రులు పర్యవేక్షించాలన్నారు. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్ధేశించుకుని, దాన్ని చేరుకోడానికి కృషి చేయాలన్నారు.అలాగే పోలీస్ శాఖ తరుపున ఎటువంటి సహాయసహకారాలు కావాలన్నా నేరుగా తనను సంప్రదించాలని సూచించారు.

ప్రిన్సిపాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ తమ పాఠశాలలో నాణ్యత, నైపుణ్యత కలిగిన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల సాధించిన విజయాలను వివరించారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు పోలీస్ కమిషనర్ బహుమతులు అందించారు. సంస్థ చేపట్టిన విద్య, వైద్యం తదితర వివరాలను ప్రతినిధులు దాసరి మురళీకృష్ణ, వివేక్ దాసరి వెల్లడించారు. పోలీస్ కమిషనర్‌ను పాఠశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. ఈసందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రూ.రెండు కోట్ల ప్రజాధనం వృథా!

- లక్ష్యానికి దూరంగా పర్యాటక భవనం
- అసాంఘిక చర్యలకు నెలవుగా అసంపూర్తి భవనం

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని పాండ్రంగి గ్రామంలో అసంపూర్తి పర్యాటక భవనం అసాంఘిక చర్యలకు నెలవుగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఐదేళ్ల క్రితం రూ.రెండు కోట్లతో చేపట్టిన భవన నిర్మాణ పనులు అర్థాంతరంగా నిలిచిపోయింది. పర్యాటకాభివృద్ధి లక్ష్యంగా చేపట్టిన భవనం సగంలోనే నిలిచిపోవడంతో ప్రజాధనం వృథా అయిందని సర్వత్రా విమర్శలున్నాయి. 2019 డిసెంబర్ 23న. అప్పటిమంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఈ భవప నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పర్యాటకశాఖ ఆధ్వర్యంలో రూ.రెండు కోట్లు కేటాయించి చేపట్టిన భవన నిర్మాణ పనులు మొదట్లో శరవేగంగానే సాగాయి. రెండు అంతస్తుల భవనం నిర్మించడానికి ప్లాన్ వేసి పనులు చేపట్టినప్పటికీ, మొదటి అంతస్తు శ్లాబు, రెండో అంతస్తుకు పిల్లర్లు వేసిన తర్వాత పనులు నిలిచిపోయాయి. దీంతో అసంపూర్తి భవనం దిష్టిబొమ్మలా దర్శనమిస్తోంది.గ్రామానికి దూరంగా అసంపూర్తి భవనం ఉండడంతో అది . అసాంఘిక కార్యక్రమాలకు నెలవుగా మారిందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.. సుమారు మూడు సెంట్లు వైశాల్యంలో, చెరువు గట్టుపై సగంలోనే మొండిగోడలతో నిలిచిన భవనం దైన్యస్థితిపై స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం అధికారులు స్పందించి, భవనాన్ని పూర్తిచేసి, వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



మొండిగోడలతో అసంపూర్తిగా ఉన్న పర్యాటక భవనం

నేరాలు ఘోరాలు

నర్సీపట్నంలో విషాదం

- తండ్రి చేతిలో కొడుకు దారుణ హత్య

ప్రజాశక్తి- నర్సీపట్నంటౌన్: మున్సిపాలిటీ వెంకునాయుడుపేట లక్ష్మీనగర్‌లో కన్నతండ్రి చేతిలోనే కొడుకు దారుణహత్యకు గురైయ్యాడు. టౌన్ సీఐ గోవిందరావు చెప్పిన వివరాలివి.

తండ్రి కొటారి రమణ ఆర్మీలో పనిచేసి రిటైర్ అయ్యాడు. శనివారం రాత్రి తండ్రీకొడుకులిద్దరూ మద్యం తాగారు. మద్యం మత్తులో కుటుంబ వ్యవహారాలకు సంబంధించి తండ్రి కొడుకులిద్దరి మధ్య మాటామాట పెరిగి కొట్టుకున్నారు. ఈ క్రమంలో ఇంట్లో ఉన్న రుబ్బు రాయితో కొడుకు భాస్కర్ (32) తలపై తండ్రి రమణ కొట్టాడు. తీవ్ర రక్తస్రావంతో ఇంట్లోనే కొడుకు భాస్కర్ మరణించాడు. ఆదివారం ఉదయం పనిమనిషి వచ్చాక గానీ విషయం బయటికి తెలియలేదు. నిందితుడు కొటారి రమణను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. టౌన్ సీఐ గోవిందరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చిత్రలేఖన పోటీల విజేతలకు బహుమతులు



బహుమతులు అందుకున్న విద్యార్థుల్లతో నిర్వాహకులు

ప్రజాశక్తి- మాధవధార : ప్రముఖ చిత్ర కళాకారులు వడ్డాది పాపయ్య, పైడిరాజు వర్ధంతి సందర్భంగా విశాఖ చిత్ర కళాపరిషత్, బిఎన్ఆర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యాన నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో విజేతలకు ఆదివారం కంచరపాలెం బిఎన్ఆర్ భవన్‌లో బహమతులను అందజేశారు. ముందుగా వడ్డాది పాపయ్య, పైడిరాజుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు. అనంతరం జివికె.రాజు అధ్యక్షతన నిర్వమించిన కార్యక్రమంలో చిత్రలేఖన పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచిన బాలలకు బహుమతులతోపాటు ప్రశంసాపత్రాలను జివిఎంసి వైద్యాధికారి డాక్టర్ పి హేమలత, వాపా స్మారక అవార్డు గ్రహీత వి.రాహుల్ పట్నాయక్, విశాఖ వ్యాలీ రోటరీ అధ్యక్షులు ఆర్ నందకిషోర్, గాజువాక లయన్స్ క్లబ్ అధ్యక్షులు సచ్చాల కోటేశ్వరరావు అందజేశారు.కార్యక్రమంలో సుంకర చలపతిరావు, మనోహర్, బుజ్జి, శివ, నాగేశ్వరరావు, రాజు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఎమ్మెల్యే గంటా పరామర్శ



మృతుని కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గంటా

ప్రజాశక్తి -తగరపువలస :కుమార్తె కాపురం కుదుట పడకపోవడాన్ని జీర్ణించుకోలేక మనస్తాపంతో బలవన్మరణానికి పాల్పడ్డ భీమిలి మండలం టి నగరపాలెం పంచాయతీ, గొల్లలపాలెం గ్రామానికి చెందిన బొట్టా శ్రీనివాసరావు కుటుంబాన్ని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదివారం పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకుంటామని, అధైర్య పడొద్దని మృతుని భార్య, కుమార్తెకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే గంటా వెంట టిడిపి మండల అధ్యక్షులు డి ఎఎన్ రాజు, పార్టీ నాయకులు పొట్నూరు రాము, టి వెంకటరమణ పాత్రుడు, పల్లా అప్పారావు, పూసర్ల రామారావు ఉన్నారు.ఈ సందర్భంగా మృతుని చిత్రపటం వద్ద ఎమ్మెల్యే గంటాతోపాటు స్థానిక టిడిపి నేతలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

జనసేన ఇన్చార్జి సందీప్ పరామర్శ

మృతుని కుటుంబాన్ని జనసేన భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పంచకర్ల సందీప్, స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వెళ్లి పరామర్శించారు.అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలే లక్ష్యం

కొత్త సంవత్సరంలో నూతన యాక్షన్ ప్లాన్ : కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామని కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద తెలిపారు. ఆదివారం ఆసుపత్రిలోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, పవర్ గ్రిడ్ సిఎస్ఆర్ నిధులు రూ.35 కోట్లతో ప్రధాన గేటు వద్ద 50 పడకల సామర్థ్యంతో కొత్త క్యాజువాలిటీ, ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సెంట్రల్ ఎసి , సిటి, ఎంఆర్ఐ మెషన్లతో కూడిన అనుబంధ ల్యాబ్, రేడియాలజీ డయాగ్నోస్టిక్ విభాగంతో అమర్చుతామన్నారు. అదనంగా జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్స్, న్యూరో సర్జరీలకు అనుగుణంగా ఐదు టేబుళ్లతో అత్యవసర ఆపరేషన్ థియేటర్లను ఏర్పాటు చేస్తామన్నారు..ప్రస్తుతం వివిధ చోట్ల ఉన్న అవుట్ పేషెంట్ కన్సల్టేషన్ గదులను ఒకే చోటకు తెస్తామన్నారు.. తల్లులు పిల్లలకు ప్రత్యేకమైన సంరక్షణకు ప్రత్యేక తల్లి శిశు భవనం ఏర్పాటుచేస్తామన్నారు. రోగుల అవసరాలకు అనుగుణంగా స్పోర్ట్స్ మెడిసిన్, పీడియాట్రిక్, ఆర్థోపెడిక్, స్పైన్ ఇంజురీ, రుమటాలజీ, వాస్కులర్ సర్జరీ,నియోనాటాలాజీ, ఫ్యామిలీ మెడిసిన్ విభాగాలు ఉంటాయన్నారు. మార్చురీలో శవాలను భద్రపరచడం కోసం అదనంగా 20 ఫ్రీజర్ బాక్సులు కొనుగోలు చేస్తామన్నారు.. విధి నిర్వహణలో వైద్యులు, సిబ్బంది బాధ్యతతో మెలిగేలా చూస్తామన్నారు. పేద రోగులకు 24 గంటలు అత్యవసర వైద్యం, వ్యాధి నిర్ధారణ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్డియాలజీ, న్యూరాలజీ, ప్లాస్టిక్ సర్జరీ, న్యూరో సర్జరీ, పీడియాట్రిక్స్, కేన్సర్ చికిత్స వంటి సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు

కలెక్టరేట్ నుండి కమాండ్ కంట్రోల్ కోసం కెజిహెచ్ అంతటా ఫోన్ నెంబర్లు అందుబాటులో ఉంచామన్నారు. రోగులు వారి కుటుంబాల ఫిర్యాదులకు కమాండ్ కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్లు 0891- 2590100, 2590102 నెంబర్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు వైద్య సేవలు సులభంగా పొందేందుకు టోల్ ఫ్రీ నెంబర్లు 104,15100 ఉన్నాయన్నారు రోగి సంరక్షణ సంబంధాలను పర్యవేక్షణకు ఇద్దరు పబ్లిక్ రిలేషన్స్ అధికారులు 7569898251, 9030 243861 ఫోను నెంబర్లలో అందుబాటులో ఉంటారన్నారు.. ఆహార సహాయం కోసం ఇస్కాన్ రెండు ఆర్ఓ ప్లాంట్లను ఏర్పాటు చేసిందని, బెంచీలతో కూడిన షెడ్ ఏర్పాటు చేశామన్నారు. నిరక్షరాస్యులు కూడా వివిధ వార్డులను సులభంగా గుర్తించేలా కెజిహెచ్ అంతటా రంగు కోడ్‌తో రేడియం లైట్లు ఏర్పాటు చేస్తామన్నారు. ల్యాబ్, రేడియాలజీ విభాగాల నుండి అవుట్ పేషెంట్, ఇన్ పేషెంట్ రోగుల మొబైల్స్‌కు నేరుగా డయోగ్రాస్టిక్ నివేదిక పంపడానికి కొత్త సౌకర్యం ప్రవేశపెట్టనున్నట్లు, దీన్ని సాధ్యం చేయడానికి అవసరమైన విధానాలను రూపొందిస్తున్నట్లు తెలిపారు

కథలలో మానవీయ కోణం

ప్రజాశక్తి- సీతమ్మధార: కథలలో మానవీయ కోణం అంతర్లీనంగా ఉంటుందని, చదివే పాఠకులకు అది తప్పకుండా స్ఫురిస్తుందని ప్రముఖ రచయిత ఈతకోట సుబ్బారావు అన్నారు. ఆదివారం, పౌర గ్రంథాలయంలో తటవర్తి భారతి స్మారక సాహితీసభ, సాహితీ పురస్కార ప్రదాన కార్యక్రమంలో మాట్లాడుతూ, మహాకవి ఆరుద్ర అన్నట్టు తల్లి ఒడిలో నుంచే కథలు నేర్చుకుంటామన్నారు. కరోనా, సోషల్ మీడియా పుణ్యమాని తెలుగు భాష ఒకింత బతికి బట్ట కలిగిందన్నారు. ఏ కథ తీసుకున్నా అందులో మానవ జీవితానికి సంబంధించిన అంశాలు తప్పనిసరిగా ఉంటాయన్నారు. మానవ బంధాలు ఆర్థిక సంబంధాలుగా మారుతున్న తరుణంలో కథలలో కూడా మార్పు వచ్చిందన్నారు. సాంకేతికత పెరుగుతున్న నేటిరోజుల్లోనూ తెలుగు సాహిత్యానికి, కథలకు ఆదరణ తగ్గలేదన్నారు. సదస్సులు, సాహిత్య సభలు ఎక్కువగా జరుగుతుండడంపై ఆనందం వ్యక్తం చేశారు. పముఖ రచయిత డాక్టర్ ఎం సుగుణరావు మాట్లాడుతూ పాలకుల విధానాలు, అనేక సంస్కరణలతో కొన్ని వృత్తులు కనుమరుగౌతున్న నేటి రోజుల్లో వాటిపై ఆధారపడే వారి జీవనస్థితిగతులపై కథలు అనేక వస్తున్నాయన్నారు. కథలలో జీవితం ఉంటుందని, చదివే పాఠకులకు అది తెలుస్తుందన్నారు.

రెండో సెషన్‌లో కథాపఠనం రికార్డింగ్‌లో మెళకువలపై విజయవాడకు చెందిన కొప్పర్తి రాంబాబు మాట్లాడుతూ ఆడియో కథలు వినిపించాలనుకునేవారు ముందుగా వాటిపై సరైన అవగాహన, భాష, మాండలీకంపై పట్టుండాలన్నారు. భాషపై లిఖిత ప్రామాణికంతో పాటు ఆయా ప్రాంతాల మాండలీకంఆధారపడి ఉంటుందన్నారు. వాస్తవ సంఘటనలు ఆధారంగా రాసే కథలు కలకాలం ఉంటాయన్నారు. సాహితీ విమర్శకులు మేడా మస్తాన్‌రెడ్డి నిర్వహణలో తటవర్తి త్రినాథ నాగేశ్వరరావు స్వాగత ఉపన్యాసం చేశారు. అనంతరం కథ, కథనం అంశాలపై యానాంకు చెందిన రచయిత దాట్ల దేవదానం రాజు మాట్లాడారు.

'వంశవక్షం రచన ప్రక్రియ ఆవశ్యకత'పై విజయనగరానికి చెందిన పప్పు భోగారావు, రచయిత ఇందు రమణ హైదరాబాదుకు చెందిన తటవర్తి శంకరరావు మాట్లాడారు. తటవర్తి భారతి స్మారక కథల పోటీ, న్యూటన్ పోతుల స్మారక కథల పోటీ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సదస్సులో సీనియర్ రంగస్థల కళాకారులు వర్రే నాంచారయ్య, పురస్కార గ్రహీతలు ప్రొఫెసర్ సిహెచ్.సుశీలమ్మ, డివి సూర్యారావు, గొర్లె శ్రీనివాసరావు, శరత్‌చంద్ర, శీరేల సన్యాసిరావు, ద్విభాష్యం రాజేశ్వరరావు పలువురు రచయితలు, సాహిత్య ప్రియులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి- విశాఖపట్నం : నగరంలోని కైలాసపురం డిఎల్‌బి స్కూల్ 1998-99 బ్యాచ్ పూర్వ విద్యార్థుల రజతోత్సవ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. . ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా అలకనంద టౌన్‌షిప్ చైర్మన్ నాగరాజు, ఒలింపిక్స్ విజేత యర్రా జ్యోతి హాజరయ్యారు పాతికేళ్ల తర్వాత కలుసుకున్న పూర్వవిద్యార్థులంతా ఆత్మీయ పలకరింపులు, అలనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకోవడం ద్వారా సందడిగా గడిపారు.ఈ సందర్భంగా డాన్సులు, పాటలు, మ్యూజికల్ ఇన్‌స్ట్రుమెంట్స్‌తో అలరించారు. కార్యక్రమంలో అలకనంద టౌన్‌షిప్ మేనేజింగ్ డైరెక్టర్ రాజశేఖర్, భవానీ ప్రసాద్, సేవా సంఘం సమితి మెంబర్ ఐ.జానకి పాల్గొన్నారు.

జిప్సా కేలండర్, డైరీ ఆవిష్కరణ



కేలండర్ ఆవిష్కరిస్తున్న జిప్సా ప్రతినిధులు

ప్రజాశక్తి- గాజువాక : గాజువాక పారిశ్రామిక ప్రాంత ప్రైవేట్ పాఠశాలల సంక్షేమ సంఘం (జిప్సా) కేలండర్, డైరీలను ఆదివారం ముత్యాలమ్మపాలెం బీచ్ వద్ద యూనియన్ నేతలు ఆవిష్కరించారు. జిప్సా ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల కరస్పాండెంట్స్, ప్రతినిధులతో ముత్యాలమ్మపాలెం బీచ్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై చర్చించారు. ఆట పాటలతో సందడిగా గడిపారు. మధ్యాహ్న భోజనం అనంతరం జిప్సా నూతన కేలండర్, డైరీలను ఆవిష్కరించి సభ్యులకు అందజేశారు.

కార్యక్రమంలో జిప్సా గౌరవ అధ్యక్షులు పి.భాస్కరరావు, అధ్యక్షుడు బి శ్రీనివాస్, కార్యదర్శి యస్ షణ్ముఖరావు, కోశాధికారి ఎం.బాబూరావు, సలహాదారులు ఎం.జగ్గారావు, మురళీ సుందర రావు, జగన్, శ్రీధర్, సభ్యులు మౌళి, రమేష్ నాయుడు, సత్యన్నారాయణ, కృష్ణంనాయుడు, ప్రసాదరావు పాల్గొన్నారు.

150 మందికి ఉచిత వైద్యసేవలు

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 44వ వార్డు నందగిరినగర్ సేవా సంఘం ఆధ్వర్యంలో లక్ష్మీ గాయత్రి ఆసుపత్రి ఎండీ కాంగ్రేగుల వెంకట రామ్‌కుమార్ సౌజన్యంతో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాంకుమార్ మాట్లాడుతూ గడచిన ఏడాది ఎన్నో ఉచిత వైద్యశిబిరాలను నిర్వహించి, రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు అందజేసామన్నారు. అందులో భాగంగానే ప్రతి నెలా మొదటివారం నందగిరినగర్‌లో ఉచిత వైద్యశిబిరం నిర్వహించామన్నారు.

అయితే 2024 ఏడాది చివరి ఆదివారం కావడంతో ప్రత్యేకంగా మెగా వైద్యశిబిరాన్ని నందగిరి నగర్‌లో నిర్వహించినట్లు తెలిపారు కార్యక్రమంలో లక్ష్మీ గాయత్రి హాస్పిటల్ డాక్టర్ రమేష్, నర్సు సుజాత, మెడికల్ సిబ్బంది దినేష్, నందగిరినగర్ సేవా సంఘం అధ్యక్షులు జయకుమార్, ఉపాధ్యక్షుడు వెంకన్న, సెక్రటరీ గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కిమ్స్ ఐకాన్, మహాత్మాగాంధీ కేన్సర్ ఆసుపత్రులకు

విఎంఆర్‌డిఏ నోటీసులు

- ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ఫిర్యాదుకు స్పందన
- వారం రోజుల్లో వివరణ ఇవ్వకుంటే కఠిన చర్యలు

ప్రజాశక్తి -సీతమ్మధార/ ఎంవిపి కాలనీ : సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని కిమ్స్ ఐకాన్ ఆసుపత్రికి విఎంఆర్‌డిఎ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఎన్ఆర్ఐ ఆసుపత్రిని మూడు నెలల క్రితం టేకోవర్ చేసుకున్న కిమ్స్ ఐకాన్ ఆసుపత్రి యాజమాన్యం, గతంలో ఎన్ఆర్ఐతో కుదిరిన ఒప్పందం మేరకు 20 శాతం మంది వరకు రోగులకు ఆసుపత్రిలో ఉచిత వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, విఎంఆర్‌డిఎ కమిషనర్‌లకు ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు రాసిన లేఖపై అధికారులు స్పందించి ఈ మేరకు నోటీసులు జారీ చేశారు. వారం రోజుల్లోగా దీనిపై వివరణ ఇవ్వాలని కోరారు. ఎన్ఆర్ఐ ఆసుపత్రిన చదరపు గజం రూ.270 చొప్పున అతి తక్కువ ధరకు 270 చదరపు గజాల భూమిని కేటాయించారని, ఇపుడు అక్కడ చదరపు గజం ధర రూ.1.50లక్షల నుంచి రూ.2లక్షల వరకు ఉంటుందని లేఖలో పేర్కొన్నారు. అలా ఒప్పందం మేరకు కేటాయించిన స్థలంలో ఏర్పాటైన ఎన్ఆర్ఐ ఆసుపత్రిలో ఉన్న 300పడకల్లో ఒప్పందం మేరకు 60బెడ్లను ఉచిత వైద్యసేవల కోసం కిమ్స్ ఐకాన్ ఆసుపత్రి యాజమాన్యం కూడా కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. అయితే కిమ్స్ ఐకాన్ హాస్పిటల్ యాజమాన్యం ఒప్పందాలను ఉల్లంఘించి, ఉచిత వైద్య సేవలను నిలిపేసిన నేపథ్యంలో ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన విఎంఆర్‌డిఎ కమిషనర్ నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో ఎటువంటి చర్యలు ఉంటాయో చూడాలి.

ఎన్ఆర్ఐ ఆసుపత్రి తరహాలోనే ఎంవిపి కాలనీలోని మహాత్మాగాంధీ కేన్సర్ ఆసుపత్రికి విఎంఆర్‌డిఎ నోటీసులు జారీ చేసింది. కేటాయించిన స్థలంలో రెండేళ్లలో ఆసుపత్రి నిర్మాణం, 20శాతం మంది పేదలకు ఉచిత వైద్యం, 15ఏళ్లలోపు హక్కుల బదలాయింపుపై నిషేధం తదితర నిబంధనలతో స్థలాన్ని కేటాయించగా, షరతులు అతిక్రమణల ఫిర్యాదుపై వారం రోజుల్లోగా వివరణ ఇవ్వాలని విఎంఆర్‌డిఎ నోటీసులు జారీ చేశారు. స్పందించకుంటే చర్యలుంటాయని చైర్మన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ కెఎస్.విశ్వనాథన్ హెచ్చరించారు.

విలువలతో కూడిన విద్యా విధానం లక్ష్యం

- పూర్వ విద్యార్థుల 'హోం కమింగ్' వేడుకలో గీతం అధ్యక్షుడు శ్రీభరత్





మాట్లాడుతున్న గీతంఅధ్యక్షుడు శ్రీభరత్, కార్నివాల్‌లో విద్యార్థుల నృత్యప్రదర్శన

ప్రజాశక్తి -మధురవాడ : హోం కమింగ్" పేరిట గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో రెండు రోజుల పాటు నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ముగిసింది. ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరైన గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ మాట్లాడుతూ, విలువలతో కూడిన విద్యావిధానాన్ని అమలు చేయడానికి తాము కట్టుబడి ఉన్నామన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న గీతం పూర్వవిద్యార్థులు గీతం విజన్ సాధించడంలో తమ వంతు సహకారం అందించాలన్నారు. గీతం ఇన్‌ఛార్జ్ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు విశ్వవిద్యాలయం ప్రగతిని వివరించారు. గీతం ప్రగతిలో పూర్వ విద్యార్థులు పాలు పంచుకోవాలని పిలుపునిచ్చారు. గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, గీతం స్టూడెంట్ లైఫ్ డీన్ బాలాకుమార్, వివిధ కళాశాలల డీన్‌లు పాల్గొన్నారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ప్రముఖ సంస్థలలో ప్రతిభను చాటుతూ కీలక స్థానాలకు ఎదిగిన పలువురు గీతం పూర్వ విద్యార్థులను అవార్డులతో సన్మానించారు. పారిశ్రామిక వేత్తగా ఎదిగిన గీతం పూర్వవిద్యార్థి గీతంకు విశిష్ట సేవలు అందించిన ఓ.నరేష్ కుమార్, పలాస ఎమ్మెల్యే జి.శిరీష, ప్రముఖ ఎడోబ్ కంపెనీలో బిజినెస్ ఆపరేషన్స్ డైరెక్టర్ జి.గిరీష్, డిజైన్ కన్సల్టెంట్‌గా రాణిస్తున్న ఎమ్.అమిత్‌లను గౌరవించారు. ఈసందర్భంగా గీతంతో తమకున్న అనుబంధాన్ని వారు వివరించారు. సమ్మేళనంలో భాగంగా విద్యార్థుల సాంకేతిక ఉత్పత్తుల ప్రదర్శన, క్రీడా సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. గీతం పూర్వ విద్యార్థుల రాకతో ఇంజనీరింగ్, ఫార్మసీ, సైన్స్, మేనేజ్‌మెంట్, దంత వైద్య విభాగాలలో అధ్యాపకులతో ముఖాముఖి నిర్వహించారు. పూర్వ విద్యార్థులు తమ కుటుంబ సభ్యులతో సహ హాజరు కావడంతో గీతం ప్రాంగణంలో వినోదాన్ని పంచే స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు.

ప్రజాశక్తి- గాజువాక : ప్రజాసమస్యలను పరిష్కరించి, మౌలిక వసతుల కల్పన ద్వారా నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం జివిఎంసి 76 వ వార్డు లో రూ.రెండు కోట్లతో పలు అభివృద్ధి పనులకు పల్లా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో రోడ్ల విస్తరణ, అభివృద్ధి, డ్రైనేజీల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు వర్షాల సీజన్‌లో ఏ ప్రాంతంలోనూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా ముందస్తుగా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని రోడ్ల విస్తరణ చేపట్టాలని అధికారులకు సూచించారు.

వార్డు కార్పొరేటర్, జివిఎంసిలో టిడిపి డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ గంధం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సహాయసహకారాలతో వార్డులో ఇప్పటికే చాలావరకు అభివృద్ధి పనులు పూర్తి చేసామన్నారు. ప్రధానంగా గెడ్డలు, డ్రైనేజీలను దృష్టిలో పెట్టుకుని భవిష్యత్‌లో ఎటువంటి ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నా మన్నారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు భీశెట్టి అప్పారావు, తాటికొండ సుదర్శన్, పీత రమణ, ఉగ్రం, మంత్రి శంకరనారాయణ, సతీష్, కూన వెంకటరావు, బొడ్డు సత్యారావు, పిల్లి అప్పారావు, రోహిత్, సోములు, రాజు, రాము, వివిఎస్ఆర్ ప్రసాద్, గెడ్డం రమణ, శివ, సత్తిబాబు, రమేష్, నాయుడు, మూర్తి , విశ్వనాధం, మోహన్‌పాల్గొన్నారు.

నిబంధనలు కచ్చితంగా పాటించాలి

సెంట్రల్ జైలు ఖైదీలతో సిపి శంఖబ్రత బాగ్చీ



సమావేశంలో మాట్లాడుతున్న సిపి శంఖబ్రత బాగ్చీ

ప్రజాశక్తి - ఆరిలోవ :జైలులోని ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగడంతోపాటు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని నగర పోలీసు కమీషనర్ శంఖబ్రత బాగ్చీ సూచించారు. ఆదివారం ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్ జడ్జి ఆలపాటి గిరిధర్, జైళ్ళశాఖ డిఐజితో కలిసి విశాఖ సెంట్రల్ జైలును సందర్శించారు. ఖైదీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జైలు నిబంధనలు ఖైదీలు తప్పనిసరిగా పాటించాలని, జైల్లో ఎటువంటి నిషిద్ధ వస్తువులను వాడకూడదన్నారు. ఎవరైనా నిషేధిత వస్తువులు కలిగి ఉంటే తీవ్రమైన చర్యలు తప్పవన్నారు. రౌడీషీటు ఉన్న ఖైదీలు మంచి ప్రవర్తనపై విడుదలైతే నైపుణ్యాల ఆధారంగా ప్రభుత్వమే ఉద్యోగ అవకాశాలు చూపుతుందన్నారు. జైళ్ళశాఖ డిఐజి ఆర్.రవికిరణ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇ-ములాఖత్, ఇంటర్వ్యూలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పర్యవేక్షణాధికారి ఎం.మహేష్ బాబు, జైలు అధికారులు పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి



వార్షికోత్సవంలో మాట్లాడుతున్న బాసర సంస్థల చైర్మన్ రమేష్

ప్రజాశక్తి - తగరపువలస: నేడున్న పోటీ ప్రపంచంలో వచ్చిన ప్రతి అవకాశాన్నీ అందిపుచ్చుకోవాలని స్థానిక బాసర విద్యాసంస్థల చైర్మన్ పూడి రమేష్ విద్యార్థులకు పిలుపు నిచ్చారు. ఆదివారం బాసర జూనియర్ కళాశాల ఇంటర్ విద్యార్థుల ఫేర్‌వెల్ ఫంక్షన్ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ రమేష్ మాట్లాడుతూ, జీవితంలో ఉన్నత స్థాయికి వెళ్లాలంటే ఇంటర్ విద్య పునాది, కీలకమన్నారు. తరగతి గదిలో చెప్పే పాఠాలను ఒకటికి పదిసార్లు నెమరు వేసుకుంటూ, సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.. ఉన్నతమైన లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలన్నారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించి జ్ఞాపికలు అందజేశారు. జోనల్ ప్రిన్సిపాల్ వివిడి రమేష్, డిఫెన్స్ కోచింగ్ హెడ్ కె మహేశ్వరరెడ్డి, కళాశాల అడ్వైజరీ కమిటీ సభ్యులు డి సత్యనారాయణరాజు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి

జ్యూట్ కార్మికుల బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి -తగరపువలస :చిట్టివలస జ్యూట్‌మిల్లు కార్మికులకు రావాల్సిన అన్ని బకాయిలను యాజమాన్యం తక్షణమే చెల్లించాలని చిట్టివలస లేబర్ యూనియన్ (ఎఐటియుసి) ప్రధాన కార్యదర్శి కొండపు ఈశ్వరరావు డిమాండ్ చేశారు.

ఆదివారం స్థానిక లేబర్ యూనియన్ కార్యాలయంలో యూనియన్ సమావేశంలో మాట్లాడుతూ పిఎఫ్, గ్రాట్యుటీ, నష్టపరిహారం చెల్లించాలని రెండేళ్లుగా కోరుతున్నా యాజమాన్యం మొండిగా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పిఎఫ్, కార్మికశాఖ అధికారులకు ఎన్నిదఫాలుగా విన్నవించినా, నేటికీ పరిష్కారం కాలేదని వాపోయారు. స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చొరవ తీసుకుని జ్యూట్ కార్మికుల బకాయిలు ఇప్పించేలా కృషి చేయాలని కోరారు. సమావేశంలో యూనియన్ నాయకులు చిల్లరాం పైడి, కానూరి రాంబాబు, మోర అప్పలరాజు, ఎన్ ఆదినారాయణ, అల్లు బాబూరావు పాల్గొన్నారు

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

జెవివి, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థుల ర్యాలీ

ప్రజాశక్తి-అచ్యుతాపురం

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కోరుతూ జన విజ్ఞాన వేదిక (జెవివి), భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో అచ్యుతాపురంలో ఆదివారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మారిశెట్టి వెంకట అప్పారావు మాట్లాడుతూ 2025 నూతన సంవత్సరానికి స్వాగతిస్తున్న సందర్భంగా మద్యం, మత్తు పానీయాలు మాదకద్రవ్యాలతో ఆనందంగా గడపడానికి నేటి యువత ఆసక్తి చూపుతుందని తెలిపారు. అయితే మత్తు, మాదక ద్రవ్యాలు లేని నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఒకరోజు వేడుకల పేరుతో మత్తు పానీయాలకు అలవాటు పడినవారు జీవితాంతం వాటికి బానిసలై శారీరకంగా మానసికంగా, సాంఘికంగా, ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారని చెబుతూ పలు ఉదాహరణలు తెలియజేశారు. మద్యానికి బానిసలైన కుటుంబాల్లో వారి పిల్లల చదువు, ఆహారం, దుస్తులు, వారిలో నిరాశ నిర్లిప్తత ఇవన్నీ పరిశీలిస్తే మత్తు పానీయాలు వలన ఆ కుటుంబాలకు జరిగే చేదు అనుభవాలు చూడగలుగుతామని చెప్పారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.రమణ మాట్లాడుతూ విద్యార్థులు, యువత మత్తు పానీయాలకు దూరంగా ఇంటి వద్దనే నూతన సంవత్సరం పండగను జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక మండల అధ్యక్షులు బొడ్డేడ సూర్య రామకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు కె.కృపానంద్, ఐద్వా మండల నాయకురాలు ఆర్.లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, జెవివి, ఎస్ఎఫ్ఐ నాయకులు

అమిత్ షా వ్యాఖ్యలపై నిరసన

ప్రజాశక్తి-అనకాపల్లి : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌పై పార్లమెంటు సాక్షిగా కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యల పట్ల క్షమాపణ చెప్పాలని జై భీమ్ సేన సేవా సంఘం అధ్యక్షులు రేబాక మధుబాబు డిమాండ్ చేశారు. అనకాపల్లి నాలుగు రోడ్ల కూడలిలో గల అంబేద్కర్ విగ్రహం వద్ద జై భీమ్ సేన సేవా సంఘం ఆధ్వర్యంలో అమిత్ షా వ్యాఖ్యలపై ఆదివారం నిరసన తెలియజేశారు. అనంతరం అంబేద్కర్‌కు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ గురించి మాట్లాడడం ఫ్యాషన్ అయిపోయిందని, అంబేద్కర్ అనే బదులుగా దేవుడి నామం స్మరిస్తే ఏడేడు జన్మల స్వర్గలోక ప్రాప్తి వస్తుందని పార్లమెంట్లో అమిత్ షా చేసిన వ్యాఖ్యలను మేము పూర్తిగా ఖండిస్తున్నామన్నారు. దీనికి ఆయన పార్లమెంట్ సాక్షిగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు మల్లవరపు లోవ చందు, వెల్లూరు పైడారావు, బేలా శివ గణేష్, పిల్లి అప్పారావు, కె.కోటపాడు సర్పంచ్ ఎర్రంశెట్టి భవాని, రాజధాని బుజ్జిబాబు, దండు సూర్యనారాయణ, ఉడత బాలాజీ, ఎర్రంశెట్టి గురయ్య, ఇరుగెల సంతోష్, రవ్వ రమేష్, గుడాల ఆనంద్, గుంటూరు సురేష్, కె శ్రీను, గణపతి అప్పారావు, కే ఉమా మహేష్, మలకలపల్లి సర్పంచ్ వై.ధనుంజయ్ పాల్గొన్నారు.

వృద్ధులకు రగ్గులు, నిత్యావసరాల వితరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో అనకాపల్లి రూరల్ ఎస్సై జక్కుల నాగేశ్వరరావు ఆర్థిక సహకారంతో 125 మంది వృద్ధులకు, నిరాశ్రయులకు రగ్గులు, 5 కేజీల బియ్యం, అరకిలో బొంబాయి రవ్వ, అరకేజీ బెల్లం చొప్పున ఆదివారం పంపిణీ చేశారు. ఇందులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ గ్రీన్ క్లబ్ చేస్తున్న సామాజిక సేవ కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో శ్రీభోగిలింగేశ్వరస్వామి దేవస్థాన చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ (ఎస్ఎఫ్ఐ), విశ్రాంత అటవీశాఖ అధికారి బీర వినోద్ కుమార్, బేతాళం శేషసాయి, వంకాయల ఈశ్వరరావు, రేబాక మధు, నైశెట్టి సత్తిబాబు, కర్రి హనుమంతరావు, గ్రీన్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట మండలం, తాళ్లపాలెం సెక్షన్ పరిధి కన్నూరుపాలెం సబ్ స్టేషన్ మెయింటెనెన్స్ పనులు నిమిత్తం సోమవారం ఉదయం 10.30 నుండి 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఈఈ రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కన్నూరుపాలెం సబ్ స్టేషన్ పరిధిలోని కన్నూరుపాలెం, తీడ, చరకం, సుందరయ్యపేట, ఆనందపురం, లాలం కొత్తూరు, జి.భీమవరం, సింగవరం, అచ్చెర్ల, మోస్సిపేట, గోకవానిపాలెం గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

విరిగిన శరీర భాగాలకు ఉచిత ఆయుర్వేద వైద్యం

ప్రజాశక్తి-సబ్బవరం : మూలికా వైద్యం ద్వారా కాలు, చెయ్యి విరిగినా, శరీరంపై దెబ్బలు తగిలినా, బెనికినా, కీళ్ల నొప్పులకు, మోకాళ్ల నొప్పులకు ఉచితంగా ఆయుర్వేద వైద్య విధానంలో కట్టు కట్టి నయం చేస్తున్నట్లు ప్రముఖ ఆయుర్వేద మూలికా వైద్య నిపుణులు, హిందీ మాస్టారు రెడ్డి కృష్ణ తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ డాక్టర్ అంబేద్కర్ గురుకులంలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న తను పేదలకు ఉచిత ఆయుర్వేద మూలికా వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. ఆదివారం పశ్చిమ గోదావరి జిల్లా గుడివాడ నుండి ఒకరు, సబ్బవరం నుండి మరొకరు రావడంతో వారికి కట్టులు కట్టి వైద్యం చేసినట్లు చెప్పారు. ఈ వైద్యాన్ని వినియోగించుకోవాలని కోరారు.



అతిథులకు మెమొంటోలు అందిస్తున్న దృశ్యం

గవరల అభివృద్ధికి పెద్ద పీట

ప్రజాశక్తి-అనకాపల్లి : గవరల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. గవర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక బెల్లం మార్కెట్లో జరిగిన గవర జాతీయుల వన సమారాధనలో ఆయన పాల్గొని మాట్లాడారు. గవర కులాన్ని బీసీ డీ నుండి బీసీ ఏ లోకి చేర్చాలని సంఘం సభ్యులు కోరగా ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ఎంపీ సీఎం రమేష్ సహకారంతో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గం ఇన్‌చార్జి భీమరశెట్టి రాంకీ, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్‌కు పూర్వ విద్యార్థుల ఫ్యాన్లు వితరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి గాంధీనగరం బిసి బాలుర వసతి గృహానికి ఆ హాస్టల్ పూర్వ విద్యార్థులు ఐదు సీలింగ్ ఫ్యాన్లు బహుకరించారు. 1975- 85 సంవత్సరాల్లో బీసీ హాస్టల్లో చదువుకున్న సుమారు వందమంది విద్యార్థులు ఆదివారం శ్రీ వేమగిరి సత్యనారాయణ స్వామి కొండ వద్ద ఆత్మీయ సమావేశం నిర్వహించి అనంతరం బీసీ హాస్టల్‌ను సందర్శించారు. విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. దోమల బెడద ఉండడంతో మెస్సులు ఏర్పాటు చేసేందుకు హామీ ఇచ్చారు. హాస్టల్లో దత్తత తీసుకొని సమస్యలను పరిష్కరిస్తామని వార్డెన్ సత్యనారాయణకు హామీ ఇచ్చారు. పూర్వ విద్యార్థులు సత్యనారాయణ ముదిరాజ్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నిజాన్ని నిర్భయంగా రాసే పత్రిక ప్రజాశక్తి



ప్రజాశక్తి కేలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాజు తదితరులు

ప్రజాశక్తి-చోడవరం

నిజాన్ని నిర్భయంగా ప్రచురించే పత్రిక ప్రజాశక్తి అని చోడవరం శాసనసభ్యులు కెఎస్ఎన్ఎస్.రాజు అన్నారు. ప్రజాశక్తి ప్రచురించిన 2025 నూతన సంవత్సర కేలెండర్, డైరీని ఆదివారం తన కార్యాలయంలో ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లగా అంకితభావంతో పనిచేస్తూ ప్రజా సమస్యలను ప్రచురించడంలో ప్రజాశక్తి కీలక భూమిక పోషిస్తుందని తెలిపారు. పత్రిక ఆవిర్భావం నుండి ఒకే లక్ష్యంతో పని చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మాజీ చైర్మన్ గూనూరు మల్లునాయుడు, పళ్ల అర్జున, ప్రజాశక్తి డివిజన్ ఆర్గనైజర్ వై.గణేష్, నియోజకవర్గంలోని ప్రజాశక్తి పాత్రికేయులు కోవెల శ్రీనివాసరావు, గొన్నాబత్తుల శ్రీనివాసరావు, భవిరి అనంత్ పాల్గొన్నారు.

వరల్డ్ యోగా కప్ సాధించిన దైవజ్ఞ

ప్రజాశక్తి-చోడవరం

యూనివర్సల్ యోగా స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల విశాఖపట్నం రిషికొండ సాయి ప్రియ రిసార్ట్‌లో జరిగిన వరల్డ్ యోగా కప్ -2024 యోగా పోటీలలో చోడవరం పతంజలి యోగా శిక్షణ కేంద్రానికి చెందిన ఆరేళ్ల ముత్యాల దైవజ్ఞ ప్రథమ స్థానం సాధించింది. ఈ సందర్భంగా యోగా గురువు పుల్లేటి సతీష్ మాట్లాడుతూ దైవజ్ఞ యోగా కప్ కైవసం చేసుకుని మన దేశానికి, మన రాష్ట్రానికి, మన జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చిందని తెలిపారు. మత్స్య ఆసనం, పద్మ సర్వంగాసనం, గండ బేరుండా ఆసనంలో మంచి ప్రతిభ కనబరిచి విజయం సాధించిందని పేర్కొన్నారు. చిన్నారిని ప్రపంచ యోగ విజేతగా తీర్చిదునందుకు యోగా గురువు సతీష్‌ని దైవజ్ఞ తల్లిదండ్రులు ముత్యాల నవీన్ కుమార్, ముత్యాల రమ్య అభినందించారు ప్రపంచ యోగా విజేత దైవజ్ఞను పతంజలి యోగ శిక్షణ కేంద్రం సభ్యులు, చోడవరం పెద్దలు, ప్రముఖులు, ప్రజలు అభినందించారు.



యోగా పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన దైవజ్ఞ

ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల ఆందోళన

నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి-అచ్యుతాపురం

రైతులు పండించిన వరి ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసి, సకాలంలో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని కోరుతూ ఎపి రైతు సంఘం, ఎపి కౌలు రైతుల సంఘం ఆధ్వర్యాన మండలంలోని హరిపాలెంలో ఆదివారం రైతులు ప్లకార్డులు పట్టుకొని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కాండ్రేగుల రామ సదాశివరావు మాట్లాడుతూ కష్టపడి పండించిన వరి పంట అకాల వర్షాలతో నేలమట్టమై మొక్కలు వచ్చి రైతులు ఆర్థికంగా నష్టపోయారని తెలిపారు. ధాన్యాన్ని వెంటనే ప్రభుత్వం కొనుగోలు చేయాలని, ధాన్యాన్ని గ్రేడింగ్ పద్ధతిలో విడదీయరాదని పేర్కొన్నారు. అప్పులు చేసి పండించిన వరి పంట దెబ్బతిని నష్టపోయిన రైతాంగానికి ఎన్టీఆర్ రైతు భరోసా పథకంలో ప్రభుత్వం ప్రకటించిన రూ.20వేలు ఆర్థిక సహాయాన్ని వెంటనే రైతుల ఖాతాలలో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో రైతు సమస్యలపై గత 18 నెలలుగా రైతులు చేసిన పోరాట ఫలితంగా క్వింటాకు రూ.300 చొప్పున పెంచారని గుర్తు చేశారు. పెంచిన ధరను చట్టబద్ధం చేయాలని ఢిల్లీలో రైతులు ఆందోళన కొనసాగిస్తుండగా వారిపై కేంద్ర బిజెపి ప్రభుత్వం ఫిరంగులతో దాడులు చేయడం దారుణమన్నారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎస్ బ్రహ్మాజీ మాట్లాడుతూ రైతు సమస్యలపై సోమవారం అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనకు రైతులు అత్యధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు బుద్ధ రంగారావు, శరగడం కనుమునాయుడు, పచారి నాగరాజు, కాండ్రేగుల నాగరాజు, రాజాన దేవుడు, మారిశెట్టి సీతారాము, రైతులు పాల్గొన్నారు.



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న రైతులు, రైతు నాయకులు

లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న సాయికృష్ణ

ప్రజాశక్తి-మునగపాక

మునగపాక గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ తెలంగాణ రాష్ట్రం యాదాద్రి భువనగిరి జిల్లాలో ప్రసిద్ధి చెందిన యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారిని ఆదివారం దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఆలయ అర్చకులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేశారు.



లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో సాయికృష్ణ

పలు చోట్ల పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు



హరిపాలెంలో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి-విలేకర్ల యంత్రాంగం

జిల్లాలోని అచ్యుతాపురం, మునగపాక, కశింకోట, సబ్బవరం మండలాల్లో పలు పాఠశాలలకు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమాలు ఆదివారం జరిగాయి.

అచ్యుతాపురం : మునగపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1975-76 సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు మండలంలోని హరిపాలెం కొండపై విజయదుర్గ ఆలయ ఆవరణలో ఆదివారం ఆత్మీయంగా కలుసుకున్నారు. ఒకరినొకరు అపాయ్యంగా పలకరించుకొని, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పిల్లలు, కుటుంబ విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తిమ్మరాజుపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ పూర్వపు సీఈవో శరగడము సూర్యనారాయణ, పసగడుగుల నారాయణరావు, ఐవిఎన్ రాజు, దొడ్డి శివ, వై సుబ్రహ్మణ్యం, బి బంగారు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : కశింకోట డిపిఎన్ జిల్లా పరిషత్ ఉన్నత



కశింకోటలో...

పాఠశాలలో 1992-93లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం విస్సన్నపేట పడమటమ్మ లోవ సమీప తోటలో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎక్కడెక్కడో ఉన్నత స్థాయిల్లో స్థిరపడ్డ వారంతా కలిసి తమ హోదాలను మరిచి ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు.

సబ్బవరం : స్థానిక డాక్టర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 1998-99 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థుల సమ్మేళనం దేవీపురం శ్రీసహస్రాక్షి రాజరాజేశ్వరి దేవి ఆలయం ఆవరణలో ఆదివారం జరిగింది. వారంతా పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. వారి విద్యాభ్యాసం నాటి మధుర స్మృతులను, తీపి జ్ఞాపకాలను, అల్లరి చేష్టలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. గ్రూపులుగా ఫోటోలు దిగి సందడి చేశారు. అనంతరం భారీ విందు భోజనాలు చేశారు. కార్యక్రమంలో ఎస్‌విఎస్.ఈశ్వరరావు, కె.వరహాల దొర, పి.నర్సింగరావు, జి.వేణు, డి.ఈశ్వరరావు, డి.సత్యనారాయణ, ఆర్.వాసు, గోవింద, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సబ్బవరం మండలం అంతకాపల్లి శివారు రావులమ్మపాలెంలో జెడ్‌పి హైస్కూల్లో 1987-88 సంవత్సరం పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు అడ్డూరు మజ్జిగైరమ్మ గుడి ఆవరణలో ఆదివారం అపురూప కలయికను ఏర్పాటు చేశారు. సుమారు 36 ఏళ్ల క్రితం ఆ పాఠశాల చదువుకుని ఎక్కడెక్కడ స్థిరపడిన వారంతా ఒకచోట కలుసుకున్నారు. తమలో ఏ ఒక్కరికి కష్టం వచ్చినా ఆర్థిక సహాయం చేయడానికి ఈ సందర్భంగా తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సబ్బవరపు శ్రీనివాసరావు, గనివాడ ఈశ్వరరావు, గొంప రమణ, రోమాల అక్కునాయుడు, వంటాకు ముత్యాలనాయుడు, ఆకుల పైడిరాజు, బోకం సత్యవతి, సబ్బవరపు దేవుడమ్మ తదితరులు పాల్గొన్నారు.

మునగపాక : మండలంలోని సిరసపల్లి గ్రామంలోని శ్రీకృష్ణ రిసార్ట్స్‌లో అనకాపల్లి ఎంజిహెచ్ చిన్న, హైస్కూల్ 1997-98 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ



సబ్బవరంలో...

కలయిక ఆదివారం జరిగింది. కుటుంబ సమేతంగా స్నేహితులందరూ గత జ్ఞాపకాలు నేమరవేసుకుంటూ, పరస్పర క్షేమసమాచారాలను పంచుకున్నారు. అనంతరం పూర్వ విద్యార్థి ఆళ్ల తాతమ్మ నాయుడు సారథ్యంలో తమతో చదువుకున్న మిత్రులు సుంకరమెట్ట శ్రీసత్యనారాయణ స్వామి దేవస్థానం చైర్మన్‌గా ఎంపికైన బొడ్డేడ మురళిని, సంతోషిమాత దేవస్థానం చైర్మన్‌గా ఎంపికైన మారిశెట్టి భాస్కరరావును దుస్సాలువా వేసి షీల్డ్‌తో సత్కరించారు. సాయంత్రం ఉత్సాహంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో 1997-98 బ్యాచ్ పూర్వ విద్యార్థుల కమిటీ నిర్వాకులు బోడ్డేడ మురళీ, కాండ్రేగుల సురేష్, షేక్ మథర్ (చోటా), కొణతాల లోకేష్ మద్దాల నాగ శివ, మారిశెట్టి తారక, బుద్ధ మల్లికార్జనరావు, పిఎస్‌కె.నాయుడు, పెంటకోట ఆది మోహన్, ఆవుపాటి గంగాధర్, వాసు తదితరులు పాల్గొన్నారు.



మునగపాకలో బొడ్డేడ మురళిని సత్కరిస్తున్న దృశ్యం



వైద్య సేవలు అందిస్తున్న దృశ్యం

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని పలు గ్రామాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న విశాఖపట్నానికి చెందిన కన్సర్న్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వేణు విద్యానికేతన్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన 250 మంది రోగులకు ఈసీజీ, బ్రెస్ట్ క్యాన్సర్‌కు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. మహిళలకు పలు ఆరోగ్య సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో కన్సర్న్ సంస్థ డైరెక్టర్ పీకే జోషి, పాఠశాల కరస్పాండెంట్ బివిఎస్ వేణు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-మునగపాక : మండల కేంద్రం మునగపాకలో మోదకొండమ్మ ఆలయ నిర్మాణానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ లక్ష రూపాయలు విరాళాన్ని ఆలయ కమిటీ నిర్వాహకులకు ఆదివారం అందజేశారు. నిర్మాణానికి సహకరించి, ఆర్థిక సహాయాన్ని అందజేసిన ప్రసాద్‌కు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

భవన నిర్మాణ కార్మికుని కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : బార్క్‌లో ఆర్‌విఆర్ కాంట్రాక్టర్ వద్ద పనిచేస్తూ ప్రమాదవశాత్తు పడిపోయి మృతి చెందిన శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఎ.దుర్గారావు కుటుంబాన్ని ఆదుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము డిమాండ్ చేశారు. మృతునికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని, వారి జీవనం సమస్యగా మారిందని పేర్కొన్నారు. ఉపాధి నిమిత్తం దేశం నలుమూలల నుంచి అనేకమంది వలస కూలీలు అచ్చుతాపురానికి వచ్చి కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వలసకు కార్మికుల చట్టాలను, సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఇచ్ఛా ఫౌండేషన్‌కు నిత్యావసర సరుకుల వితరణ

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని తోటాడ గ్రామంలో ఉన్న రాజ యోగాశ్రమం ట్రస్ట్ నిర్వాహకులు తమ ఉదారతను చాటుకున్నారు. అచ్యుతాపురం మండలం కొండకర్ల గ్రామంలో గల ఇచ్ఛా ఫౌండేషన్ వికలాంగ పిల్లలకు ఆదివారం నిత్యావసర వస్తువులను అందజేశారు. ట్రస్ట్ సభ్యులు అక్కడి పిల్లలతో కాసేపు గడిపారు. ఫౌండేషన్ ద్వారా చేస్తోన్న సేవలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ సూరిశెట్టి సుషుమ్న కుమార్, ఫౌండర్ తుగ్నిట్ మధు, ఫిజియోథెరఫిస్ట్ పవన్, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కొణతాల జన్మదిన వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-కశింకోట : అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ జన్మదిన వారోత్సవాలు తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు ఆధ్వర్యాన ఆదివారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఆదివారం కొక్కరాపల్లి ప్రేమ సమాజం అనాధాశ్రమానికి నెలకు సరిపడా నిత్యవసర సరుకులు, దుప్పట్లు, పిల్లలకు బిస్కెట్లు, చాక్లెట్లు పంపిణీ అందజేశారు. ముఖ్య అతిథులు ఎపియుఎఫ్ఐడిసి చైర్మన్ పీలా గోవిందసత్యనారాయణ, ఎపి గవర వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర చేతులు మీదగా అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి కూటమి నాయకులు ఉగ్గిని రమణమూర్తి, వేగి గోపికృష్ణ, పెంటకోట రాము, నిమ్మదల సన్యాసినాయుడు, కాయల మురళీధర్, నైనముశెట్టి రమణరావు, ఉల్లింగల రమేష్, కర్రి వెంకట సత్యనారాయణ, ఎంపిటీసీలు షేక్ దర్గా, బుదిరెడ్డి అప్పుడు, షేక్ బాబర్, మాజీ సర్పంచులు బుదిరెడ్డి గంగయ్య, మజ్జి ప్రకాశరావు, ద్వారపూడి సత్తిబాబు, సిద్దిరెడ్డి శ్రీను, జెర్రిపోతుల నూకునాయుడు, అప్పికొండ అప్పారావు, సత్యనారాయణ, కూటమి నాయకులు పాల్గొన్నారు



నిత్యావసర సరుకులు అందిస్తున్న పీలా తదితరులు

5న రోడ్డు రవాణా రంగ కార్మికుల సదస్సును విజయవంతం చేయాలి

సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి

రోడ్డు రవాణా రంగ కార్మికుల సమస్యలపై జనవరి 5న జరిగే సదస్సును జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకర్‌రావు, అనకాపల్లి జిల్లా మోటార్ వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ జి.దేముడునాయుడు పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అఖిలభారత రోడ్డు ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ సిఐటియు) ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహ్మద్ హాజరవుతున్నారని తెలిపారు. ఈ సదస్సులో రోడ్డు రవాణా రంగ కార్మికుల సమస్యలపైనా, భారత న్యాయ సంహిత చట్టం డ్రైవర్లకు కలిగే నష్టాలపై చర్చించనున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర



మాట్లాడుతున్న శంకరరావు

ప్రభుత్వం రోడ్డు రవాణా సంబంధించిన లైసెన్సులు, ఫిట్నెస్ సర్టిఫికెట్లు ప్రైవేటు సంస్థలకు, ఏజెన్సీలకు ఇవ్వడానికి వ్యతిరేకిస్తూ ఈ సదస్సు జరుగుతుందన్నారు. ఈ సదస్సులో జిల్లాలో ఉన్న ఆటో, మోటార్, వెన్, బస్ డ్రైవర్లు రోడ్డు రవాణా రంగ కార్మిక సంఘాలు, ఫెడరేషన్లు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, కార్యదర్శి అడిగర్ల రాజు, నాయకులు మీసం త్రినాథరావు పాల్గొన్నారు.

గాయపడిన కార్మికునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : విధి నిర్వహణలో ప్రమాదం జరిగి గాయపడిన భవన నిర్మాణ కార్మికుడికి భవన నిర్మాణ కార్మిక సంఘం తరుపున ఆర్థిక సహాయం అందజేశారు. మండలంలోని భోగాపురం గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు లాలం ముల్లు నాయుడు పరంజి కడుతూ ప్రమాదవశాత్తు పడిపోవడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. ముల్లు నాయుడు శ్రీమణికంఠ భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) సభ్యులుగా ఉన్నారు. దీంతో సంఘం అధ్యక్షుడు రాజాన అప్పలనాయుడు ఆదివారం సంఘం తరఫున రూ.3000 ఆర్థిక సహాయాన్ని ముల్లు నాయుడుకు అందజేశారు. సంఘం సభ్యుల కష్ట సుఖాలలో ఒకరికొకరు సహకరించుకుంటున్నట్లు అప్పలనాయుడు తెలిపారు. ఐక్యతగా భవన నిర్మాణ కార్మికులు కొనసాగాలని సిఐటియు ఆధ్వర్యంలో సంఘం నిరంతరం సమస్యలపై పోరాడుతుందని ఆయన పేర్కొన్నారు. గాయపడిన కార్మికులను ఆదుకున్న సంఘ అధ్యక్షులకు సంఘ సభ్యులకు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము కృతజ్ఞతలు తెలిపారు.



ఆర్థిక సాయం అందిస్తున్న అప్పలనాయుడు

హత్య కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-చోడవరం : స్థానిక పాత బస్టాండ్‌లో శుక్రవారం రాత్రి చోడవరం రెల్లి వీధికి చెందిన సమాధుల ప్రేమ్ కుమార్ (32)ను హత్య చేసిన బంగారి దుర్గా ప్రసాద్‌ను అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్లు చోడవరం సీఐ పి.అప్పలరాజు తెలిపారు. శుక్రవారం రాత్రి నిందితుడు దుర్గాప్రసాద్ మద్యం సేవించి పాత బస్టాండ్ వద్ద నిద్రిస్తున్న ప్రేమ్ కుమార్‌ను కర్రతో తలపై మోదీ హత్య చేసినట్లు వెల్లడించారు. మృతిని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్ట్ చేసి ఆదివారం కోర్టుకు తరలించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్సై నాగ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-చోడవరం : ఉమ్మడి విశాఖ జిల్లాలో పలు ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న చీడికాడ మండలం మంచాల గ్రామానికి చెందిన గుణపాటి సువార్త రాజును అరెస్టు చేసినట్లు చోడవరం సిఐ పి.అప్పలరాజు తెలిపారు. సువార్త రాజు కొన్ని సంవత్సరాలుగా ఉమ్మడి విశాఖ జిల్లాలో ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద బస్సు ఎక్కుతున్న మహిళల బ్యాగులో నుండి సెల్ ఫోన్లు, బంగారు వస్తువులు దొంగతనం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇలాగే చోడవరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో దొంగతనం చేస్తుండగా సువార్త రాజును పట్టుకున్నట్లు చెప్పారు. ఆయన వద్ద నుండి పది సెల్ ఫోన్లు, కొంత నగదు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై నాగ కార్తీక్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అనకాపల్లి తెలుగు భాషా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో స్థానిక ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో ఆదివారం రామాయణం అనే అంశంపై విద్యార్థులకు మండల స్థాయిలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి సమన్వయకర్త కొయ్యిలాడ రామ్మోహన్ మాట్లాడుతూ గత ఆదివారం అచ్యుతాపురం మండలంలో పలు పాఠశాలలో పోటీలు నిర్వహించి కొంతమంది విద్యార్థులను ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. ఎంపిక చేసిన విద్యార్థులకు ఇప్పుడు ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో మండల స్థాయి పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ పరీక్షలను జి రంగబాబు అమర జ్యోతి, కెవి రమణ, కర్రి మల్లేశ్వరి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి, సమితి సభ్యులు సిస్టల తమ్మిరాజు, ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాల అధినేత ధర్మిరెడ్డి ప్రసాద్, ప్రిన్సిపల్ కె శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రహదారి సౌకర్యం కల్పించాలని..

గుర్రాలతో గిరిజనుల ర్యాలీ


నిరసన చేపడుతున్న గిరిజనులు

ప్రజాశక్తి -కొత్తకోట:ఎన్ని ప్రభుత్వాలు మారినా నిరుపేద గిరిజనులకు రహదారి సౌకర్యం కల్పించలేక పోతున్నాయని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె. గోవిందరావు, గిరిజన సంఘం మండల నాయకులు చీపురు శంకరరావు ఆవేదన వ్యక్తం చేశారు. రావికమతం మండలం చీమలపాడు శివారు చలిసింగం గ్రామ రోడ్డుకు తక్షణమే ఫారెస్ట్ అనుమతులు కల్పించి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఆదివారం గుర్రాలతో కొండ పై ప్రయాణం చేస్తూ పలువురు గిరిజనులు నిరసన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా గోవిందరావు, శంకరరావు మాట్లాడుతూ గ్రామంలో సుమారు 110 కుటుంబాలలో 380 జనాభా కలిగి ఉన్నారన్నారు. వీరికి గత కొన్నేళ్లుగా రహదారి సౌకర్యం కల్పిస్తామని హామీలు ఇచ్చి మభ్యపెట్టడమే గాని ఆ దిశగా చర్యలు శూన్యమన్నారు. చీకాయపాడు నుంచి చలిసింగం వరకూ సుమారు మూడు కిలోమీటర్లు దూరం కొండలపై రోజూ ప్రయాణం చేయాల్సివస్తోందన్నారు. గుర్రాలు కొనుగోలు చేసుకొని గిరిజన కుటుంబాలు నిత్యం వాటిపై ప్రయాణం చేస్తున్నారని వారు పేర్కొన్నారు. గ్రామంలో రేషన్ డిపో లేక కొండ దిగువ చికాయపాడు గ్రామంలో డిపో ఏర్పాటు చేయడంతో నానా అవస్థలు పడుతున్నా రన్నారు. రేషన్ సరుకులు సైతం గుర్రాలపై రవాణా చేసుకుంటున్నారన్నారు. వ్యవసాయ ఉత్పత్తులు అమ్ముకోవాలంటే కొత్తకోట వారపు సంతకు గుర్రాలు సాయంతో తరలిస్తున్నారన్నారని తెలిపారు. రోడ్డు లేక గర్భిణీలను డోలీలో మోసుకొని కొత్తకోట ప్రాథమిక వైద్య కేంద్రానికి నానా అవస్థలు పడి తరలించాల్సి వస్తోందన్నారు. రోడ్డు నిర్మాణానికి 2018-19 లో సుమారు రూ 3 కోట్లు నిధులు మంజూరు చేశారని ఫారెస్టు అను మతులు లేక పోవడంతో రోడ్డు పనులు నిలిచి పోయాయన్నారు. 30-10-23న చలిసింగం గ్రామానికి సుమారు మూడు కిలోమీటర్లు రోడ్డు నిర్మాణానికి రూ.2.65 నిధులు మంజూరు అయినట్లు అప్పటి శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ మళ్లీ శంకుస్థాపన చేశారన్నారు. ఇంత చేసినా ఫారెస్ట్ అనుమతులు లేకపోవడంతో రోడ్డు నిర్మాణానికి మోక్షం కలగ లేదని ఆవేదన చెందారు. ప్రస్తుతం ఫారెస్ట్ అధికారులు జాయింట్ సర్వే చేశారని నివేదిక తయారు చేసి కలెక్టర్ కు అందజేయాల్సి ఉందన్నారు.కలెక్టర్ డి ఎల్ సి సమావేశం ఏర్పాటు చేసి ఫారెస్ట్ అనుమతులు ఇవ్వాల్సి ఉందన్నారు. 2020లో నర్సీపట్నం అప్పటి సబ్ కలెక్టర్ కాళినడకన వచ్చి మౌలిక సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని అయినా సమస్యలు మాత్రం పరిష్కారం కాలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డోలీలు లేకుండా చేస్తామని పత్రికల్లో ప్రకటనలు చేస్తున్నారని ఫారెస్ట్ అనుమతులు ఇవ్వపోవడంతో తమకు డోలీ మోతలు తప్పడం లేదని, ఇప్పటికైనా సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమం లో పలువురు గిరిజనులు పాల్గొన్నారు.



కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభిస్తున్న అనిత

హెటిరో ఆధ్వర్యాన అభివృద్ధి పనులు

-ప్రారంభించిన హోం మంత్రి అనిత

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని పెదతీనార్ల, దొండవాక, రాజయ్యపేట గ్రామాల్లో హెటిరో డ్రగ్స్ కంపెనీ సి ఎస్ ఆర్ ఫండ్స్ కింద చేపట్టిన సామాజిక అభివృద్ధి పనులను హోం మంత్రి వంగలపూడి అనిత ఆదివారం ప్రారంభించారు.పెదతీనార్ల గ్రామంలో కోటి రూపాయలు నిధులతో సిసి రోడ్లు, దొండవాకలో కోటి 35 లక్షలతో కమ్యూనిటీ భవనం, రాజయ్యపేటలో 2 కోట్ల రూపాయలతో రోడ్లు,15 లక్షల రూపాయలతో ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు కంపెనీ ప్రతినిధులు వెల్లడించారు. ఈ మేరకు కంపెనీ సి ఎస్ ఆర్ ఫండ్స్ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను అనిత ప్రారంభించి, కంపెనీ యాజమాన్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఆర్ ప్రతినిధి సుధాకర్,కంపెనీ ప్రతినిధులు సుబ్బారెడ్డి, కుల్లారెడ్డి, రాజారెడ్డి,వీర వెంకట సత్యనారాయణ రెడ్డి, అరుణ్ కుమార్ రెడ్డి శ్రీనివాస్, తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, రాజయ్యపేట పంచాయతీ సర్పంచ్ పిక్కి అప్పలనర్స, పెదతీనార్ల ఎంపీటీసీ సభ్యులు మెరుగు నాగేశ్వరరావు, చినతీనార్ల ఎంపీటీసీ సభ్యులు అప్పలస్వామి,పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కురుందాసు నూకరాజు, క్లస్టర్ ఇంచార్జ్ కొప్పిశెట్టి బుజ్జి, టిడిపి నాయకులు పిక్కి శ్రీనివాసరావు, గోసల తాతారావు పాల్గొన్నారు.


గొలుగొండలో చదువుతున్న విద్యార్థులు

గ్రంథాలయాల్లో 'చదవడం మాకిష్టం'

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండ శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి రాజబాబు ఆధ్వర్యంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే బుక్ రీడింగ్, స్టోరీ టెల్లింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రంథాల యాధికారి మాట్లాడుతూ.. విద్యార్థులు గ్రంథాలయాలకు రావడంతో విజ్ఞానం పెరుగుతుందని తెలిపారు.

నర్సీపట్నం టౌన్: స్థానిక శాఖ గ్రంథాలయంలో ఆదివారం జరిగిన చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ దమయంతి మాట్లాడుతూ, తెలుగు భాష మన సంపదని ఇంగ్లీష్ హిందీ తో పాటు ముఖ్యంగా విద్యార్థులు తెలుగును నేర్చుకోవాలన్నారు. విద్యార్థులచేత నీతి కథలు చదివించి వాటిలో నీతిని వివరించారు.క్రీస్తు పూర్వం, క్రీస్తు శకం ప్రాముఖ్యతను గురించి వివరించారు. రిసోర్స్ పర్సన్ సిహెచ్ భవాని చరిత్రలో కొన్ని ముఖ్య సంఘటనలు వివరించారు. రిసోర్స్ పర్సన్ కృష్ణవేణి తెలుగు బాష లో వున్న సందులు, విభక్తులు వివరించారు. విద్యార్థులకు ఆంగ్ల అక్షర మాలతో జంబుల్ గేమ్ ఆడించారు. విద్యార్థులకు నూతన సంవత్సర కేకులు కట్ చేసి పంచారు. కార్యక్రమంలో విశ్రాంత క్రీడల ఉపాధ్యాయులు ప్రభాకర్ పాల్గొన్నారు.

సాగుదారులకు పరిహారం చెల్లించాలి : సిపిఎం


మాట్లాడుతున్న సిపిఎం నేత అప్పలరాజు

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని బుచ్చిరాజుపేటలో పేదలకు నష్టపరిహారం, ప్యాకేజీ చెల్లించిన తర్వాతే కారిడార్ పనులు చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అప్పలరాజు, మండల కార్యదర్శి ఎం రాజేష్ డిమాండ్ చేశారు. బుచ్చిరాజుపేటలో పరిశ్రమల ఏర్పాటుకు పనులు చేపడుతుండగా తెలుసుకొని, స్థానిక రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బుచ్చిరాజు పేట గ్రామంలో సర్వే నెంబర్ 224/2 లో యలమంచిలి పెద్ద వెంకట రమణ, యలమంచిలి అప్పారావు కుటుంబాలకు చెందిన పిల్లలు పది కుటుంబాలు వారు సుమారు 12 ఎకరాలు భూమిని సాగు చేసి కుంటూ కుటుంబాలను పోషించు కుంటున్నారన్నారు. వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్లో భాగంగా ఏపీఐఐసీ అధికారులు ఆ భూములకు పరిహారం చెల్లించకుండా బల్క్ డ్రగ్స్ కంపెనీలకు ఈ భూములలో 135 అడుగుల వెడల్పుతో రోడ్డు వేయడానికి సన్నాహాలు చేస్తున్నారన్నారు. 2013 భూ సేకరణ చట్ట ప్రకారం సాగుదారులకు నష్టపరిహారం చెల్లించిన తర్వాతే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్, ఆర్ డి ఓ స్పందించి సాగుదాలకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వై.సత్తిబాబు, వై.బాబూరావు, వై.కృష్ణ,వై.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న టౌన్ సిఐ

వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పి. ఆర్. టి. యు. ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమాన్ని పిఆర్టియు జిల్లా అధ్యక్షులు డి.గోపీనాథ్, టౌన్ సిఐ గోవిందరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించి తగు సూచనలు సలహాలు అందించారు. అవసరమైన వారికి కళ్లద్దాలు అందించారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు రాహుల్, పృథ్వీరాజ్, రఘు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎల్ సుగుణ, ఉపాధ్యక్షులు ఎంఎస్ ప్రసాద్, కౌన్సిలర్ అల్లు అప్పారావు, ఎంఈఓ తలుపులు పాల్గొన్నారు.

'భారీ వాహనాలను నిలిపేయాలి'

ప్రజాశక్తి-రోలుగుంట:రోలుగుంట మండలంలో తిరుగు తున్న భారీ నల్ల రాయి లారీలను నిలువరించాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కే.గోవిందరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ నిత్యం మండలంలోని వడ్డిప, శరభవరం, బుచ్చంపేట తదితర గ్రామాల మీదుగా భారీ వాహనాలు తిరడంతో రోడ్లు ఛిద్రమౌతున్నాయని చెప్పారు. ఇటువంటి లారీలు తిరగనివ్వవద్దని స్పీకర్ అయ్యన్న ఆదేశించినా అధికారులు పట్టించు కోలేదన్నారు. ఇప్పటికైనా స్పందించాలని కోరారు.

న్యాయ పోరాటానికి సిద్ధం కావాలి

రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షులు పాపారావు



మాట్లాడుతున్న పాపారావు

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్: న్యాయ పోరాటానికి సిద్ధం కావాలని రెల్లిహక్కుల పోరాట సమితి పిలుపునిచ్చింది. మండలంలో చెట్టుపల్లి గ్రామంలో రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షులు ఎర్రం శెట్టి పాపారావు అధ్యక్షతన జిల్లా రెల్లి మహా సభ నిర్వహించారు. రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి న్యాయ పోరాటానికి సిద్ధం కావాలని తీర్మానం చేశారు. ఈ సందర్భంగా పాపారావు మాట్లాడుతూ, అన్ని రంగాలలో వెనుకబడిన రెల్లీలకు సామాజిక సమ న్యాయం జరగాలన్నారు.ఎస్సీ రిజర్వేషన్ల లో రెల్లీల వాటా 5 శాతం పెంచాలని రెల్లి కార్పోరేషన్ కేటాయించాలని అన్ని రంగాలలో వెనుకబడిన రెల్లీలకు విద్య, ఉపాధి, ఆర్థిక సంక్షేమ రంగాలలో ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పూండి మల్లేశ్వరరావు జిల్లా అధ్యక్షులు కోనా అప్పారావు, యర్రంశెట్టి వరప్రసాద్ జిల్లా కార్యదర్శి బంగారి సూరిబాబు, నాతవరం మండలం అధ్యక్షులు బంగారి రాజుబాబు, గొలుగొండ అధ్యక్షులు న్యాయవాది బంగారి రామకృష్ణ , మహిళ అధ్యక్షురాలు ముత్యాలు త్రివేణి, మహిళ నాయకురాలు బౌరుశెట్టి అనురాధ, లలితా కుమారి తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ :మండలంలోని ఏఎల్.పురం గ్రామంలో ఆదివారం రెల్లి గర్జన మహా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సామాజిక రెల్లి ఉపకులాల జిల్లా అధ్యక్షులు యర్రంశెట్టి అప్పనబాబు మాట్లాడుతూ, రెల్లిలకు 5 శాతం రిజర్వేషన్ పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రెల్లి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కోన నారాయణరావు, మజ్జి సత్యనారాయణ, బంగారు లక్ష్మీనారాయణ, బంగారు కృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంఘం ప్రతినిధి

ప్రభుత్వం ఆదుకోవాలి


ప్రజాశక్తి-కోటవురట్ల: విశ్వకర్మల సంక్షేమ సంఘాలను ప్రభుత్వం ఆదరించాలని ఆదివారం ఎండపల్లి గ్రామంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో పలువురు విశ్వకర్మలు కోరారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధి ఎం రమణ మాట్లాడుతూ ప్రభుత్వం వీరిని అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు. విశ్వకర్మలు ఐక్యంగా ఉండి సమస్యల పరిష్కరించుకోవాలని పలువురు కోరారు. ఈ కార్యక్రమంలో వెంకట్రావు, శివాజీ, మాణిక్యం పాల్గొన్నారు.

ఆలయానికి అర కిలో వెండి విరాళం

ప్రజాశక్తి -మాడుగుల:మండలంలోని ఎం.కోడూరు. మోదకొండమ్మ అమ్మవారి ఆభరణాలు నిమిత్తం అదే గ్రామానికి చెందిన కొట్టాపు కొండలరావు, రమణ బాబు, వరాహమూర్తి, మాణిక్యం దంపతులు, బైలపూడి వెంకట్రావు దంపతులు ఆరకిలో వెండిని ఆలయ కమిటీ చైర్మన్, గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావుకు ఆదివారం విరాళంగా అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి శ్రీనివాస్ శర్మ, పడాల అప్పలనాయుడు, శ్రీను, ముమ్మిన రవణ బాబు, పడాల అప్పల నరసయ్య, గోపాల్, పోతిన జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఒడిదుడుకుల సాగు

- ప్రతికూలతల మధ్య వ్యవసాయం
- 2007 నుంచి పెరగని సాగునీటి ఆయకట్టు
- విపత్తులతో నలిగిపోతున్న రైతు



నర్సీపట్నంలో తడిచిన వరి పనలు ఎత్తుతున్న రైతులు(ఫైల్)

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో ఈ ఏడాది వ్యవసాయం ఒడిదుడుకులను ఎదుర్కొంది. ఖరీఫ్ ఆరంభంలో వర్షాలు లేక, తరువాత భారీ వర్షాలతో సాగు క్లిష్టంగా మారింది. వర్షాభావంతో ఆకుమడులు ఆలస్యంగా వేయడంతో ఉడుపులు జాప్యమయ్యాయి. కొద్దిపాటి వర్షాలకు ఆకులుపోసిన తరువాత కురిసిన భారీ వర్షాలకు ఆకుమడులు దెబ్బతిన్నాయి. మళ్లీ రైతులు ఆకులు పోసి వరి సాగు చేశారు. కోతల సమయంలో కురిసిన వర్షాలతో రైతు కన్నీటిపర్యంతమయ్యాడు. ఈ ఏడాది మొత్తం ప్రకృతి ప్రతికూలతల మధ్య రైతులు వ్యవసాయం చేశారు. బ్యాంకుల నుంచి పంటరుణాలు అరకొరగా అందాయి. కౌలురైతుకు మంజూరుచేసిన కొద్దిపాటి కార్డులకు రుణాలు ఇవ్వక ప్రయివేటు వ్యాపారుల నుంచి వడ్డీకి తెచ్చుకొని పెట్టుబడులు పెట్టారు. కూటమి ప్రభుత్వం రైతుకు ఇస్తానన్న రూ.20వేలు సాయం చేయలేదు. జిల్లాలో ఖరీఫ్‌లో వరి 1.41 లక్షల ఎకరాల్లో సాగైంది. చెరకు సాగు భారీగా పడిపోయింది. తుమ్మపాల, ఏటికొప్పాక, తాండవ సహకార సుగర్ ఫ్యాక్టరీలను ప్రభుత్వం ఆధునీకరించి పునరుద్ధరించకపోవడంతో 20వేల ఎకరాలకు తగ్గింది. ప్రస్తుతం నడుస్తున్న గోవాడ సుగర్, మూతపడ్డ మూడు సుగర్ ఫ్యాక్టరీల క్రషింగ్ కాలంలో లక్ష ఎకరాల చెరకు సాగు ఉండేది. మూడు సుగర్ ఫ్యాక్టరీల క్రషింగ్ ఆపేయడంతో చెరకు సాగుపై రైతు ఆసక్తి చూపడంలేదు.

ప్రకృతి విపత్తులు, ప్రతికూలతల కంటే వ్యవసాయంపై ప్రభుత్వం చూపుతున్న అశ్రద్ధ, నిర్లక్ష్యంతో ప్రతియేటా ఒత్తిళ్ల మధ్య రైతు సాగుచేయాల్సివస్తోంది. ఏ ప్రభుత్వమూ సాగునీటి వనరుల కల్పనపై తగిన శ్రద్ధకాదు, కనీస శ్రద్ధ కూడా చూపడంలేదు. ఎన్నికల వాగ్దానాలకు రాజకీయ పార్టీలు ఉపయోగించుకుంటున్నాయి తప్ప ప్రతిపాదిత సాగునీటి వనరులను పూర్తిచేసి రైతుకు సాగునీటి వసతి కల్పించడంలేదు. జిల్లాలో ప్రతి ఎకరాకూ సాగునీటి సదుపాయం కల్పించే అవకాశముంది. వర్షాధారంపై సాగుచేసే పరిస్థితిరాని ప్రతిపాదిత ప్రాజెక్టులున్నాయి. ఈ నీటి ప్రాజెక్టులు పూర్తికి ఏ ప్రభుత్వమూ సరిపడా నిధులు కేటాయించి ఖర్చు చేయడంలేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం 19,322 ఎకరాల ఆయకట్టు కల్గిన పెద్దేరు జలాశయం 2007లో ప్రారంభించింది. తరువాత వచ్చిన ప్రభుత్వాలేవీ ఇప్పటివరకు దశాబ్దమున్నర కాలంలో ఒక్క ఎకరాకైనా అదనంగా సాగునీటి సౌకర్యం కల్పించలేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వం, విభజిత ఆంధ్రప్రదేశ్‌లో టిడిపి, వైసిపి ప్రభుత్వం ప్రతిపాదిత ప్రాజెక్టుల పని జరగడానికి తగిన నిధులు విడుదల చేయలేదు. దీంతో బాబూజగ్జీవన్‌రామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, పోలవరం ఎడమ కాలువ పనుల్లో పురోగతిలేదు. 2009లో శంకుస్థాపన చేసిన సుజల స్రవంతి ప్రాజెక్టు విలువ రూ.ఏడువేల కోట్ల నుంచి రూ.17వేల కోట్లకు పెరిగింది. కానీ ప్రభుత్వ కేటాయింపులు పెంచక పనులు జరగలేదు.

తాండవ, రైవాడ, కోనాం, పెద్దేరు జలాశయాలు, చిన్న, మధ్య తరహా నీటి వనరుల కింద 3.70 లక్షల ఎకరాలకు (41 శాతం) సాగునీటి సౌకర్యం ఉంది. ప్రతిపాదిత ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, పోలవరం ఎడమకాలువ పనులు పూర్తిచేసి, ఏలేరు కాలువ నీటిని ఆయకట్టుకు మళ్లిస్తే జిల్లాలో 4.79 లక్షల ఎకరాల అదనపు ఆయకట్టుకు సాగునీటి వసతి లభిస్తుంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం సాగునీటి వనరులు అభివృద్ధికి తగిన నిధులు కేటాయించలేదు. ప్రభుత్వాల నిర్లక్ష్యంతో వ్యవసాయంపై ఆధారపడ్డ రైతుకు ఆశించిన ఫలసాయం రావడంలేదు. రూ.17వేల కోట్ల విలువైన ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి 2024-25 బడ్జెట్‌లో రూ.63.21 కోట్లు కూటమి ప్రభుత్వం కేటాయించింది. ప్రధాన గేట్లు, కాలువల మరమ్మతులు, పూడికతీత నిమిత్తం తాండవకు రూ.7.50 కోట్లు, పెద్దేరుకు రూ.10వేలు, రైవాడ, కోనాం జలాశయాలకు రూ.20వేలు చొప్పున కేటాయించి వ్యవసాయంపై తమ నిర్లక్ష్యాన్ని కూటమి ప్రభుత్వం చాటిచెప్పుకుంది.




గ్రామస్తులతో మాట్లాడుతున్న అనిత

కారిడార్ నిర్వాసితులకు ఎకరానికి రూ.30 లక్షల కంటే అధికంగా చెల్లించాలి

ప్రజాశక్తి- నక్కపల్లి: మండలంలోని పెదబోదిగల్లంలో కారిడార్ నిర్వాసితులకు పునరావాసం కల్పించేందుకు సేకరిస్తున్న భూములకు ఎకరానికి 30 లక్షల కంటే అధిక ధర చెల్లించాలని గ్రామస్తులు కోరారు. నక్కపల్లిలో హోం మంత్రి అనిత తన స్వగృహం నందు పెదబోదిగల్లం సర్పంచ్ మున్నిషా ఆధ్వర్యంలో గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా ఇల్లులు కోల్పోతున్న నిర్వాసితులకు పునరావాసం కల్పించేందుకు పెదబోదిగల్లంలో స్థలం గుర్తించడం జరిగిందన్నారు. ఎకరానికి 30 లక్షల చొప్పున చెల్లించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, సహకరించాలని కోరారు. పునరావాసం కోసం భూములు ఇచ్చిన రైతులకు ఇల్లులు లేని వారికి ఇల్లులు ఇస్తామని, ఏర్పాటు చేయబోయే పరిశ్రమలలో ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం మంచి ధర ఇచ్చిందని, భూమిని ఇచ్చేందుకు ముందుకు రావాలని కోరారు. పెదబోదిగల్లం భూములు చాలా విలువైనవని అధిక ధర చెల్లించాలని పలువురు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ నరసింహ మూర్తి, తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు వెంకటేష్ పాల్గొన్నారు.

రూ. 2 లక్షల బీమా చెక్కు అందజేత

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని రాజయ్యపేట పంచాయతీ దొండవాక గ్రామానికి చెందిన బొంది దారలుకు రూ. 2 లక్షలు బీమా చెక్కును హోంమంత్రి వంగలపూడి అనిత ఆదివారం అందజేశారు. బోయపాటి గ్రామానికి చెందిన బొంది ధనలక్ష్మి ఇటీవల మృతి చెందారు. ఈ మేరకు ప్రధానమంత్రి జీవనజ్యోతి భీమా యోజన పథకం కింద మృతురాలు భర్త బొంది దారలు కు 2 లక్షల రూపాయల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, వెలుగు ఏపీఎం శ్రీనివాస్, ఏపీజీవీబీ మేనేజర్ విజయ్ తేజ, వెలుగు సీసీ లు రాజు,సన్యాసిరావు, అప్పారావు, కోటి పాల్గొన్నారు.



రక్త దానదాతకు ధ్రువ పత్రం అందజేస్తున్న నాయకులు

రక్తదాన శిబిరం

ప్రజాశక్తి -కొత్తకోట: రావికమతం మండలం టీ అర్జాపురం గ్రామంలో స్థానిక సచివాలయం వద్ద గ్రామ యువత ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో దాదాపు 60 యూనిట్ల రక్తం సేకరించారు. అనకాపల్లికి చెందిన అభయాంజనేయ బ్లడ్ బ్యాంక్, విశాఖపట్నం కి చెందిన విజయశ్రీ బ్లడ్ బ్యాంక్ సంయుక్తంగా సేకరించారు. టి.అర్జాపురంతో పాటు కొత్తూరు, మత్సవానిపాలెం, దొండపూడి వంటి చుట్టుపక్కల గ్రామాల యువకులు పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా టిడిపి మండల శాఖ అధ్యక్షులు రాజాన కొండ నాయుడు, గ్రామ సర్పంచ్ మడగల అర్జున వైస్ ఎం పిపి ఎం భవాని ప్రసాద్ మాట్లాడుతూ,ఒకరి రక్తదానంతో మరో ముగ్గురికి ప్రాణదానం చేయవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, ఉపాధ్యాయులు కాళింగ సతీష్, మత్య వెంకటరమణ పాల్గొన్నారు....

విద్యార్థుల సమస్యలపై అలసత్వం



సమస్యలు తెలుసుకుంటున్న ఈశ్వరరావు

ప్రజాశక్తి- మాడుగుల: గిరిజన విద్యార్థులకు మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందని ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యులు మరువాడ ఈశ్వరావు తెలిపారు. ఆదివారం మండలంలో ఎల్ పొన్నవోలు పంచాయతీలో నరసయ్య పేట గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సుమారు 240 మంది విద్యార్థులు చదువుతున్నా పాఠశాల హాస్టల్లో సరియైన మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉన్నాయన్నారు. నాసిరకం కందిపప్పు, శనగపలుకులు వాడుతున్నారన్నారు. ఈ విషయాలన్నీ జిల్లా కలెక్టర్ తెలియజేస్తామన్నారు

ఆకట్టుకున్న విద్యార్థుల నృత్యాలు

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక అమేయా వరల్డ్ స్కూల్‌వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా రెండోరోజు ఆదివారం స్కూల్ ప్రాంగణంలో విద్యార్థినులు ప్రదర్శించిన పలు నృత్యాలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. శ్రీకృష్ణ లీలలు, గోదాదేవి కళ్యాణం, పలు నాటికలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ అరుణ, ప్రిన్సిపాల్ దేవి, ఉపాధ్యాయులు, తదితరులు అభినందించారు.

పర్యాటక ప్రాంతాలు కిటకిట



చాపరాయి వద్ద పర్యాటకుల సందడి

ప్రజాశక్తి-అరకులోయరూరల్: ఆంధ్రా ఊటీ అరకులోయలో సందర్శకుల సందడి ఆదివారం నెలకొంది. ఘాట్రోడ్లో వాహనాలు బారులుతీరాయి. సుంకరమెట్ట కాఫీ తోటలు, గాలికొండ వ్యూపాయింట్, గిరిజన మ్యూజియం, పద్మావతి గార్డెన్, తదితరాలు పర్యాటక కేంద్రాలు రద్దీగా మారాయి. అతిథిగృహాలు, హోటళ్లు పూర్తిగా నిండిపోయాయి. మంచు అందాలను తమ కెమెరాల్లో బంధించేందుకు సందర్శకులు ఆసక్తి చూపించారు. కాఫీ తోటల్లో అధిక సమయం వెచ్చించారు.వన భోజనాలు చేస్తూ ఆనందంగా గడిపారు.ప్రముఖ పర్యాటన కేంద్రమైన అరకులోయలో పర్యాటక కేంద్రాలు వీక్షించేందుకు పర్యాటకులు అధికంగా తరలి వచ్చారు.

అరకులోయ మండలం సుంకరమెట్ట సమీపంలో కాఫీ ప్లాంటేషన్, వ్యూ పాయింట్ వద్ద గంటల తరబడి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. దీంతో కిలో మీటర్ల పొడవున వాహనాలు రాకపోకలు నిలిచిపోయాయి. పోలీస్ సిబ్బంది, వాలంటీర్లు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. దీంతో రాకపోకలు యధావిధిగా కొనసాగాయి.

డుంబ్రిగుడ: మండలంలో పర్యాటక ప్రదేశాలైన చాపరాయి జలపాతం, అంజోడ సిల్క్, అరకు పినారిలో ఆదివారం అధిక సంఖ్యలో పర్యాటకులు తరలి రావడంతో కిటకిట లాడాయి.

ఘనంగా వెంకన్న ఊరేగింపు

ప్రజాశక్తి -నక్కపల్లి: ప్రాచీన పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం ఆలయ అర్చకులు ప్రసాద్ ఆచార్యులు, కృష్ణమాచార్యులు, శేషాచార్యులు గోపాలా చార్యులు ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుని ఉత్సవమూర్తులను పుణ్యకోటి వాహనం పైన, గోదాదేవి అమ్మవారి ఉత్సవమూర్తులను పల్లకిలోను వేయింపజేసి తిరు వీధి సేవ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

ఆధార్ సెంటర్ ఏర్పాటు

ప్రజాశక్తి -రావికమతం: రావికమతం యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో శాశ్వత ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు బ్రాంచ్ మేనేజర్ న్యాకేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రావికమతం మండలానికి చెందిన వారే కాకుండా, ఎక్కడి వారినైనా సరే ఈ బ్యాంకుకు వచ్చి ఆధార సేవలను పొందవచ్చునన్నారు. మొబైలు లింకు, ఫోటో మార్పు, వేలిముద్రలు, పుట్టిన తేదీ మార్చుకోవడం, అడ్రస్ మార్పు, పేర్లను సరి చేసుకోవడం, చిన్నపిల్లలకి బాల ఆధార్ అప్డేట్ సేవలన్నింటిని పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఆధార్ల సెంటర్ ఆపరేటర్ గంగరాజు, బ్యాంకు సిబ్బంది పలువురు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బ్రాంచ్ మేనేజర్